TGTEL/25/A0827

# ప్రజా దివాన్

తెలుగు దినపత్రిక

prajadivvs57@gmail.com

సంపుటి : 3 సంచిక : 250 | గురువారం 03-09-2026 | ఎడిటర్: ఎస్ ఎన్ మౌనిక | పేజీలు : 8 వెల 3 /-

విలేఖరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ ... విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ ... ప్రజల సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలపై ప్రేరణ కలిగించాలి అనుకుంటున్నారా.. ? బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా ... ? అయితే రండి ... అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..

సెల్ : 9000281049

నియోజకవర్గ ఇంచార్జ్‌లు, జిల్లా స్టాఫర్‌లు మండల రిపోర్టల్‌లు కావలెను...



## అయోధ్య రామాలయ తొలి సీఈవోగా జితేంద్ర మిశ్ర

- తొలి సీఈవోగా జితేంద్ర మిశ్ర ఎంపిక
- విశ్రాంత ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్ర
- 39 ఏళ్లపాటు వాయుసేనలో సేవలు
- 5,585 దరఖాస్తుల పరిశీలన
- 16 మందికి ఇంటర్వ్యూలు

2 లో



## బెంగళూరు ట్రాఫిక్ కష్టాలు.. కర్ణుడికీ తప్పలేదట!

సిలికాన్ వ్యాలీ ఆఫ్ ఇండియాగా పేరొందిన బెంగళూరు.. ట్రాఫిక్ కష్టాలకూ చిరునామా. 'రెండు కిలోమీటర్లకు గంటపైనే పట్టింది' అనడం ఇక్కడ సర్వసాధారణం. అందుకే ఈ రోడ్లపై నిత్యం జోకులు పేలుతుంటాయ్.

పేజి 2లో ▶

## జనసేన యువజన విభాగం 'జై కొట్టు'




2 లో

- 'జై కొట్టు' లోగో ఆవిష్కరణ
- పిఠాపురంలో జరిగిన సభలో ఆవిష్కరణ
- లోగోను ఆవిష్కరించిన మంత్రి నాదెండ్ల మనోహర్
- కార్యకర్తలకు పవన్ కల్యాణ్ ఆడియో సందేశం
- యువతకు రాజకీయాల్లో ప్రత్యేక స్థానం

## డీఆర్‌డీఎల్‌కు ఉచితంగా భూమి కేటాయించాలి.. రక్షణ మంత్రిని కోరిన సీఎం రేవంత్

### రాజ్‌నాథ్‌సింగ్‌తో సీఎం రేవంత్ భేటీ



- డీఆర్‌డీఎల్‌కు ఉచిత భూమి కోరిన సీఎం
- ఇన్వెస్ట్ తెలంగాణ సదస్సుకు ఆహ్వానం
- రక్షణ ఎక్స్‌పోలో భాగస్వామ్యం కావాలని విజ్ఞప్తి
- ఆదిలాబాద్ విమానాశ్రయంపై చర్చ
- ఇప్పటికే 750 ఎకరాల భూసేకరణ
- మరో 750 ఎకరాలు సేకరించేందుకు సిద్ధం
- రామ్మోహన్‌నాయుడితోనూ రేవంత్ భేటీ
- ఆదిలాబాద్, మామునూరు ఎయిర్‌పోర్టులపై చర్చ

దిల్లీ: దిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో సమావేశమయ్యారు. ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026కు రక్షణమంత్రిని ఆహ్వానించారు. గ్లోబల్ సమ్మిట్ రక్షణ ఎక్స్‌పోలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. దేవరకద్ర డీఆర్‌డీఎల్ ప్రాజెక్టుకు ఉచితంగా భూమి కేటాయించాలని సీఎం కోరారు. ఆదిలాబాద్ విమానాశ్రయానికి సంబంధించి రాజ్‌నాథ్‌తో చర్చించిన సీఎం.. ఇప్పటికే 750 ఎకరాలు భూసేకరణ చేపట్టినట్టు తెలిపారు. మరో 750 ఎకరాలు సేకరించేందుకు సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు. మంత్రి వివేక్, ఎంపీలు మల్లు రవి, బలరామ్ నాయక్, అనిల్ యాదవ్ తదితరులు సీఎం వెంట ఉన్నారు.

రామ్మోహన్‌నాయుడితో రేవంత్ భేటీ

పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడితో సీఎం రేవంత్ భేటీ అయ్యారు. ఆదిలాబాద్, మామునూరు సహా ఇతర ఎయిర్‌పోర్టుల అంశం ఆయన చర్చించారు.

పేజి 2లో ▶

## కేటీఆర్ హద్దు మీరి మాట్లాడితే ప్రజలు క్షమించరు: మంత్రి పొంగులేటి




- టీఆర్‌పై మంత్రి పొంగులేటి విమర్శలు
- హద్దు మీరి మాట్లాడితే ప్రజలు క్షమించరన్న మంత్రి
- కాంగ్రెస్ పాలనలో రైతులకు అండ
- వరి సాగులో తెలంగాణ నంబర్ వన్
- 10 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు
- గత ప్రభుత్వ అప్పులు చెల్లిస్తున్నాం
- రెండేళ్లలో 15 లక్షల రేషన్ కార్డులు
- కొత్తగా 3 లక్షల మందికి పింఛన్లు

హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యిరోజుల ప్రజా పాలనలో సామాన్యుల కష్టాలు తీర్చేందుకు కృషి చేశామని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ముఖ్యమైన అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని.. ప్రజల అవసరాలకు అనుగుణంగా తమ పాలన కొనసాగుతోందని చెప్పారు. రాష్ట్ర సచివాలయంలో సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరితో కలిసి పొంగులేటి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నేతలపై ఆయన విమర్శలు గుప్పించారు.

పేజి 2లో ▶

## ప్రేమ్‌కుమార్ మృతి కలచి వేసింది: పవన్



2 లో

## రెండు ఆర్టీసీ బస్సులు ఢీ..!



తాళ్లరేవు: కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం చొల్లంగి వద్ద 216వ జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కాకినాడ నుంచి అమలాపురం, అమలాపురం నుంచి కాకినాడ వెళ్తున్న రెండు ఆర్టీసీ బస్సులు ఎదురెదురుగా ఢీకొట్టుకున్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరు డ్రైవర్లకు గాయాలయ్యాయి. బస్సుల్లో వెళ్తున్న ప్రయాణికులంతా సురక్షితంగా ఉన్నారు. క్షతగాత్రలును 108లో కాకినాడ ఆసుపత్రి తరలించారు.

## నాపై ఎవరు ఆరోపణలు చేయించారో తెలుసు: మంత్రి కొండా సురేఖ



- కుమార్తె వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయొద్దని విజ్ఞప్తి
- ఖర్గేకు తన వివరణ ఇచ్చిన సురేఖ
- పదవిలో కొనసాగించాలని అధిష్ఠానానికి వినతి
- అవినీతి ఆరోపణలు లేకుండా పనిచేస్తున్నానని వెల్లడి
- తనకు షోకాజ్ నోటీసు ఇవ్వడమే తప్పన్న మంత్రి

2 లో

## కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనలో ఎటు చూసినా విధ్వంసం, వికృతం: కేటీఆర్



2 లో

హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ (ఖు=) విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనపై బీఆర్‌ఎస్ ఛార్జ్‌షీట్ విడుదల చేసింది. ఈ సందర్భంగా తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో

## యూకేలో ఎంబీఏ..

### బాసర బ్రిడ్జిపై నుంచి పడి యువకుడి మృతి



నవీపేట: నిర్మల్ జిల్లా బాసరలో విషాదం చోటుచేసుకుంది. నిజామాబాద్ జిల్లా నందిపేట మండలం కౌల్పూర్ గ్రామానికి చెందిన రమావత్ సాయికిరణ్ (25) గోదావరి నదిలో పడి చనిపోయాడు. యూకేలో ఎంబీఏ చేస్తున్న అతడు ఇటీవల స్వగ్రామానికి వచ్చాడు. ఈ నెల 5న తిరిగి యూకే వెళ్లాల్సి ఉంది. ఈ క్రమంలో మంగళవారం బాసర ఆలయానికి సాయికిరణ్ వెళ్లాడు. దర్శనం అనంతరం బ్రిడ్జిపై ఫొటోలు దిగుతుండగా ప్రమాదవశాత్తు నదిలో పడిపోయాడు. విషయం తెలుసుకుని కుటుంబసభ్యులు గాలింపు చేపట్టగా బుధవారం అతడి మృతదేహం లభ్యమైంది. తండ్రి రమావత్ భోజారామ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక పీఎస్‌లో పోలీసులు కేసు నమోదు

## ఉత్తరాంధ్ర.. ఉత్తమాంధ్ర కావడం ఖాయం: సీఎం చంద్రబాబు

- నదుల అనుసంధానమే లక్ష్యం
- ప్రతి ఎకరాకూ సాగునీరు
- ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు
- వచ్చే ఏడాది సింహాద్రికి నీళ్లు
- సాగునీటి ప్రాజెక్టులే ఆధునిక దేవాలయాలు
- ఎడమ కాలువను విస్తరించనున్నాం
- 2028 నాటికి 12 ప్రాజెక్టులు పూర్తి
- అనకాపల్లి మరో రంగారెడ్డి అవుతుంది
- ఉత్తరాంధ్రకు వలసలు వచ్చేలా అభివృద్ధి
- ఉత్తరాంధ్ర.. ఉత్తమాంధ్ర.. ఉన్నతాంధ్ర



పాయకరావుపేట: గోదావరి, కృష్ణా సహా రాష్ట్రంలోని అన్ని నదులనూ అనుసంధానం చేస్తామని ఏపీ సీఎం చంద్రబాబు (జష్ట్రుఅఎత్థుఝఎబ) అన్నారు. ప్రతి ఎకరాకూ నీళ్లిచ్చి జలహారతితో తెలుగుతల్లి రుణం తీర్చుకుంటామని చెప్పారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం పీఎల్ పురం వద్ద పోలవరం ఎడమ కాలువ ద్వారా గోదావరి జలాలను సీఎం చంద్రబాబు విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో సీఎం మాట్లాడారు. సాగునీటి ప్రాజెక్టులను ఆధునిక దేవాలయాలుగా నమ్ముతున్నట్లు చెప్పారు. ఉత్తరాంధ్ర.. ఉత్తమాంధ్ర కావడం ఖాయమన్నారు.

పేజి 2లో ▶

TGTEL/25/A0827
ప్రజా దివాన్
తెలుగు దినపత్రిక
03-09-2026

# సంపాదకీయం

## జెన్‌జీని మోదీ జయించగలరా?

'నిలదొక్కుకోవాలంటే తడబడడం అవసరం' అని ఒక కవి అన్నారు. ప్రస్తుతం మోదీ ప్రభుత్వం అదే దారిలో ఉన్నట్లు కనిపిస్తోంది. జూలై 20--25 తేదీల మధ్య దేశవ్యాప్తంగా జరిగిన నిరసనల్లో పాల్గొన్న విద్యార్థులపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లను బుట్టదాఖలు చేయాలని, తదుపరి దర్యాప్తులు చేయరాదని ఉన్నత న్యాయస్థానం ఆదేశించడంతో... దేశ రాజధానిలో కాక్రోచ్ జనతా పార్టీ నేతృత్వంలో సెప్టెంబర్ 5న పెల్లుబుకాల్సిన మరో అల్లకల్లోలం సమసిపోయినట్లేనని భావించవచ్చు. సెప్టెంబర్ 12, 13 తేదీల్లో ఢిల్లీలో జరగాల్సిన బ్రిక్స్ సమ్మిట్ నేపథ్యంలో మరోసారి శాంతిభద్రతల సమస్య తలెత్తవచ్చునని కేంద్రం భావించినందువల్లే సామరస్య వైఖరిని అవలంబించక తప్పలేదని స్పష్టమవుతోంది. ఎఫ్ఐఆర్‌లను రద్దు చేస్తామని, నీట్ పేపర్ లీక్‌లతో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లిస్తామని సీజేపీ ప్రతినిధులతో ఒప్పందం కుదుర్చుకుని నెల రోజులు దాటింది. అయితే కేంద్రం ఎంతకూ ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో ఉపాధ్యాయుల దినోత్సవం రోజున ఇండియా గేట్ నుంచి ఢిల్లీ పోలీసు హెడ్ క్వార్టర్స్ దాకా నిరసన ప్రదర్శన నిర్వహిస్తామని సీజేపీ ప్రకటించింది. దీంతో న్యూఢిల్లీలో పోలీసులు భారతీయ నాగరిక్ సురక్షా సంహితలోని సెక్షన్ 163 కింద అనుమతిలేని అన్ని సమావేశాలను పూర్తిగా నిషేధించారు. ఈ నిరసన ప్రదర్శనపై నిషేధం విధించాలని ఒక రిటైర్డ్ పోలీసు అధికారి ద్వారా సుప్రీంకోర్టులో పిటిషన్ కూడా దాఖలు చేయించారు.

సాధారణంగా అయితే పెద్ద ఎత్తున బలగాలను తరలించి, న్యూఢిల్లీని యుద్ధ క్షేత్రంగా మార్చి, ఇంటర్నెట్ సదుపాయాలను నిలిపివేసి, విద్యార్థుల ప్రదర్శనను తొక్కివేయగల శక్తి మోదీ సర్కార్‌కు ఉన్నది. విద్యార్థులతో ఒప్పందం కుదుర్చుకున్న తర్వాత కూడా వారిని డిజిటల్ ఆధారాలతో గుర్తించి వేధించడం కేంద్రం సహజ వైఖరికి నిదర్శనం. ఆ సమయంలో పెల్లెట్ల ప్రయోగం, ఇతర దారుణాలపై అనేక సంస్థలు కోర్టుకు వెళ్లడంతో ఉన్నత స్థాయి కమిషన్‌ను నియమించాల్సి వచ్చింది. అయినప్పటికీ విద్యార్థులు ప్రభుత్వ నిజాయితీని శంకించవలసిన పరిస్థితులు తలెత్తాయి. అయితే ఒక అంతర్జాతీయ శిఖరాగ్ర సదస్సు సమయంలో పోలీసులు స్వైర విహారం, హింసాకాండ మూలంగా విదేశీ ప్రతినిధులకు అసౌకర్యం కలిగించడమే కాక, అంతర్జాతీయ ప్రతిష్ఠ దెబ్బతింటుందన్న ఆందోళనతో ప్రభుత్వం పట్టువిడుపుల ధోరణిని ప్రదర్శించక తప్పలేదు. నిరసన ప్రదర్శనను తాము నిషేధించే ప్రసక్తి లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసిన మర్నాడే విద్యార్థులపై ఎఫ్ఐఆర్‌లను రద్దు చేయాలని కేంద్రం, ఢిల్లీ పోలీసులు దరఖాస్తులు పెట్టుకున్నారు. విద్యార్థులపై కేసులు ఉపసంహరించుకుంటామని, ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు మూడు నెలలలోగా నష్టపరిహారం చెల్లిస్తామని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు విన్నవించుకున్నారు. దీంతో రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 కింద తన అసాధారణ ప్రత్యేకాధికారాలను ఉపయోగించుకుని విద్యార్థులపై ఎఫ్ఐఆర్‌లను ఉపసంహరించాలని సుప్రీంకోర్టు ఆదేశించడం, తాము నిరసన ప్రదర్శనను ఉపసంహరించుకుంటున్నామని సీజేపీ ప్రతినిధులు ప్రకటించడంతో పరిస్థితులు సద్దుమణిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఈ పరిణామాలతో జూన్--జూలై నెలల్లో జరిగిన విద్యార్థుల నిరసన ప్రదర్శనల ప్రకంపనలు దేశంలో ఇంకా కొనసాగుతూనే ఉన్నాయని అర్థమవుతోంది. ఢిల్లీలో జరిపిన నిరసన ప్రదర్శనలతో ఆగకుండా సీజేపీ దేశంలోని అనేక రాష్ట్రాల్లో ప్రజా సమస్యలపై ఆందోళనలకు ఉపక్రమించింది. ప్రభుత్వ విధానాల సమీక్ష, స్కూళ్లలో మౌలిక సదుపాయాల పరిస్థితులు, ప్రశ్నపత్రాల లీక్ సమస్యలు, పరీక్షల నిర్వహణలో లోపాలు, టీచర్ల పోస్టుల ఖాళీలు, నిరుద్యోగం, పెట్రోల్‌లో ఇథనాల్ కలపడం వంటి సమస్యలపై మహారాష్ట్ర, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్, కర్ణాటక, ఢిల్లీలలో ఆందోళనలు నిర్వహించారు. ఢిల్లీలోని వివిధ ప్రాంతాల్లో అధ్వానంగా ఉన్న స్కూళ్లకు వెళ్లి 'స్కూల్ ఠీక్ కరో' ఉద్యమాన్ని ప్రారంభించారు. జాతీయ వర్కింగ్ కమిటీని ఏర్పాటు చేసి 'క్యాబోల్తీ హై పబ్లిక్' పేరుతో దేశవ్యాప్త పర్యటనలు ప్రారంభించడంతో సీజేపీకి ఏదో బృహత్తర లక్ష్యం ఉన్నట్లు భావించక తప్పడం లేదు.

సీజేపీ లక్ష్యం ఏదైనా, దాని భవిష్యత్తు ఎలా ఉన్నప్పటికీ, తీవ్ర ఒత్తిడి వస్తే తప్ప తన వైఖరి మార్చుకునే ధోరణి కేంద్రంలో కనపడకపోవడం సాధారణంగా మారింది. విద్యార్థుల ఆందోళన తారస్థాయికి చేరుకున్న తర్వాతే విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో రాజీనామా చేయించారు. ఇప్పుడు ఇండియాగేట్ నుంచి ర్యాలీ చేస్తామని హెచ్చరించిన తర్వాతగానీ విద్యార్థులపై ఎఫ్ఐఆర్‌లను ఉపసంహరించుకునేందుకు ప్రభుత్వం దిగిరాలేదు. ఎందుకు ప్రతి సమస్యనూ తెగేదాకా లాగి ఆ తర్వాత వెనక్కి తగ్గడం? ప్రతిసారీ ప్రభుత్వ పరువును కాపాడేందుకు సర్వోన్నత న్యాయస్థానం ముందుకురాలేదు కదా! దాని పరిమితులు దానికి ఉన్నాయి. ఎందుకో సమస్యలను పరిష్కరించడంలో, లేదా అంచనా వేయడంలో మోదీ ప్రభుత్వం విఫలమవుతోందనే అనుమానాలు కలుగుతున్నాయి. సమస్యలను పరిష్కరించేందుకు ఒక మేధో యంత్రాంగాన్ని రూపొందించుకోలేకపోవడం, కేవలం బల ప్రయోగాన్నే నమ్ముకోవడమే ఇందుకు కారణం కావచ్చన్న అభిప్రాయం కలుగుతోంది.

పన్నెండు సంవత్సరాల పరిపాలన తర్వాత దేశంలో చెప్పుకోదగ్గ స్థాయిలో, అది కూడా విద్యార్థుల నుంచి మోదీ సర్కార్ ఎందుకు ప్రతిఘటనను ఎదుర్కోవాల్సి వస్తోంది? కొత్త తరం ఇప్పుడు ప్రతి నిర్ణయాన్నీ ప్రశ్నిస్తోంది. వ్యవస్థల్లో లోపాల్ని ఎత్తిచూపుతోంది. వారికి మద్దతుగా కాంగ్రెస్‌తో పాటు ఇతరేతర శక్తులు కూడా తోడవుతున్నాయి. అంతమయ్యాయనుకున్న రకరకాల వామపక్షాలు కూడా ఇప్పుడు అత్యుత్సాహంతో తమ వంతు క్రియాశీలక పాత్ర పోషిస్తున్నాయి. సోషల్ మీడియా ఉపయోగంలో ఈ అన్ని శక్తులూ కలిసికట్టుగా విజృంభిస్తున్నాయి. ఎస్ఎఫ్ఐ వంటి విద్యార్థి సంఘాల నేతలే కాదు, బిహార్‌లో తన ఉనికి కోసం పోరాడుతున్న సీపీఐ ఎంఎల్ (లిబరేషన్) వంటి పార్టీ కూడా తమ విద్యార్థి సంఘం నాయకురాలు నేహా బోరా ద్వారా జరుగుతున్న పరిణామాలను, బీజేపీని ఎండగట్టేందుకు ఉపయోగించుకుంటున్నదంటే అన్ని వామపక్ష శక్తులూ ఎలా సంఘటితమవుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుత పరిస్థితులను రాజకీయంగా ఉపయోగించుకునేందుకు ఈ శక్తులు ప్రయత్నించడంలో ఆశ్చర్యమేమీ లేదు. అవి విజయం సాధించగలవా అన్నది చెప్పలేము కానీ కమలనాథులు మాత్రం ఆత్మరక్షణలో పడ్డారనడంలో సందేహం లేదు.

రాజకీయ పార్టీల దృక్కోణాల్లోంచి కొత్త తరం దేశాన్ని చూడడం లేదు. కులం, మతం, ప్రాంతం, చివరకు లింగం వంటి సంప్రదాయ గుర్తింపులను కూడా ఈ తరం అధిగమించి ఒక ప్రత్యేక గుర్తింపుతో ముందుకు వచ్చిందనడంలో సందేహం లేదు. చాలా మంది సంప్రదాయ రాజకీయ నాయకులకు వారి ప్రవర్తన, భాష, జీవన శైలి,

# ప్రేమ్‌కుమార్ మృతి కలచి వేసింది: పవన్

మొదటిపేజీ తరువాయి

అల్లవరం: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం బెండమూర్లంకకు చెందిన జనసైనికుడు రోళ్ల ప్రేమ్‌కుమార్ ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై మృతి చెందడం కలచి వేసిందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. అతని ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఆ కుటుంబానికి అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. జీవితం ఎంతో అమూల్యమైనదని, ర్యాలీలు, బ్యానర్ల ఏర్పాటులో స్వీయ భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

### రూ.5 లక్షల సాయం అందజేత

ప్రేమ్‌కుమార్ కుటుంబానికి అన్ని విధాలా అండగా నిలుస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ హామీ ఇచ్చారు. బుధవారం ఆయన జనసేన ఎమ్మెల్యేలతో కలిసి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారికి పార్టీ తరఫున రూ.5 లక్షల సాయం అందించారు. మృతుడి తండ్రి సతీష్‌తో మాట్లాడారు. ఇంజినీరింగ్ చదువుతూ ఇటీవలే ఉద్యోగానికి ఎంపికైన కుమారుడు మృతి చెందడంపై బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి మాట్లాడుతూ మృతుడి సోదరుడు ఆదినారాయణకు ఉద్యోగం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యేలు గిడ్డి సత్యనారాయణ, దేవ వరప్రసాద్, డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల బాబు తదితరులు పాల్గొన్నారు.

# జనసేన యువజన విభాగం 'జై కొట్టు'

మొదటిపేజీ తరువాయి

పిఠాపురం: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా బుధవారం పిఠాపురంలో ఏర్పాటు చేసిన సభలో మంత్రి నాదెండ్ల మనోహర్ పార్టీ యువజన విభాగం 'జై కొట్టు' లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కార్యకర్తలకు ఆడియో సందేశం ఇచ్చారు.

మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ.. "చెయ్యెత్తి జై కొట్టు' నినాదం మనందరినీ ఎంతో కదిలిస్తుంది. ఆ స్ఫూర్తిని మీకు అందించాలనే అధినేత పవన్ ఈ లోగో పెట్టారు. జై కొట్టు నినాదంతో ముందుకెళ్లాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. రాజకీయాల్లో యువతకు ప్రత్యేక స్థానం కల్పించాలనే ఈ విభాగాన్ని ఏర్పాటు చేశాం. అరుపులు.. కేకలు కాదు.. క్రమశిక్షణ ఎంతో ముఖ్యం. అధినేత ఆదేశాలను జనసైనికులు క్రమశిక్షణతో పాటించాలి" అని సూచించారు.

# ఉత్తరాంధ్ర.. ఉత్తమాంధ్ర

## కావడం ఖాయం: సీఎం చంద్రబాబు

మొదటిపేజీ తరువాయి

### వచ్చే ఏడాదికి సింహాద్రి అప్పన్న చెంతకు గోదావరి జలాలు..

"అనకాపల్లి బెల్లమంత తియ్యగా ఈరోజు ఎప్పటికీ గుర్తుంటుంది. రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చాం. నిండు మనసుతో దీవెన ఫలితంగానే అనకాపల్లికి గోదారమ్మ వచ్చింది. వెలిగొండతో కృష్ణమ్మను తరలించి మార్కాపురం జిల్లాకు నీళ్లిచ్చాం. తూర్పు కనుమలు, అడవులు, నదులు, హైవేలను దాటుకుని ఉత్తరాంధ్రకు గోదావరి వచ్చింది. వచ్చే ఏడాది నాటికి సింహాద్రి అప్పన్న, అరసవెల్లి సూర్యనారాయణ స్వామిచెంతకూ గోదావరి జలాలు తీసుకెళ్తాం. రాష్ట్రంలో ప్రతి ఎకరాకూ నీళ్లిచ్చి జలహారతితో తెలుగుతల్లి రుణం తీర్చుకుంటాం. గలగలా గోదావరి, బిరబిరా కృష్ణమ్మ పరుగులతో రాష్ట్రాన్ని సుభిక్షం చేస్తాం. ఈ జల విజయం.. ప్రజల విజయం. జలం ఉంటే జీవం.. జీవితం. గంగమ్మ ఉంటేనే పరిశ్రమలు, ఉపాధి, భద్రత, భవిష్యత్తు.

### గొడ్డలి పార్టీతో పోలవరానికి శాపం

2019లో గొడ్డలి పార్టీ అధికారంలోకి రావడం పోలవరానికి శాపమైంది. 2024లో ప్రజలు కూటమిని గెలిపించి పోలవరానికి శాపవిముక్తి చేశారు. గొడ్డలి పార్టీ విపక్షంలోనూ విషం కక్కుతోంది. విశాఖ రాజధాని అని మాయమాటలు చెప్పారు.. మావిగన్ అని మాట మార్చారు. సరిగా పనిచేయకపోతే కఠిన చర్యలు తప్పవని కాంట్రాక్టర్లను హెచ్చరించా. గోదావరి, కృష్ణా నదులతో ప్రజలకు మంచి జరగాలనేది నా జీవితాశయం. కాలువలో ప్రవహిస్తున్న ప్రతి నీటి చుక్క వెనుక ఇంజినీర్ల ప్రతిభ, కార్మికుల కష్టం, రైతుల నిరీక్షణ, నిర్వాసితుల త్యాగం, ప్రభుత్వం సమర్థత ఉన్నాయి.

ఎడమ కాలువను విస్తరించి ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి అనుసంధానిస్తాం. 2028 నాటికి 12 ప్రాజెక్టులు పూర్తిచేసి జాతికి అంకితం చేస్తాం. అందరూ అసూయపడేలా అనకాపల్లి జిల్లా అభివృద్ధి చెంది మరో రంగారెడ్డి అవుతుంది. రాబోయే రోజుల్లో ఉత్తరాంధ్రకే వలస వచ్చే విధంగా మారుతుంది. ఉత్తరాంధ్ర.. ఉత్తమాంధ్ర, ఉన్నతాంధ్ర కావడం ఖాయం. విశాఖకు ఐదు డేటా సెంటర్లు వస్తే ఐదు టీఎంసీల నీళ్లు కావాలి. 500 టీఎంసీలు తెచ్చే శక్తి మనకు ఉంది"అని చంద్రబాబు అన్నారు.

# నాపై ఎవరు ఆరోపణలు చేయించారో తెలుసు: మంత్రి కొండా సురేఖ

మొదటిపేజీ తరువాయి

దిల్లీ: తన కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయొద్దని కాంగ్రెస్ పెద్దలను కోరినట్లు తెలంగాణ మంత్రి కొండా సురేఖ (ఖశీఅఋ ూబతీవనష్ట్రు) తెలిపారు. ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేను కలిసి తన వివరణ ఇచ్చినట్లు చెప్పారు. నా వ్యవహారంపై పార్టీలో చర్చించి ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో తెలియదన్నారు. దిల్లీలో మీడియాతో కొండా సురేఖ మాట్లాడారు.

"కాంగ్రెస్ అధిష్ఠానానికి నేను చెప్పుకోవాల్సిందంతా చెప్పాను. పార్టీ పెద్దలు ఆలోచిస్తామని చెప్పారు. నా బిడ్డ స్వతంత్రంగా ఉంది. పెళ్లి చేసుకుని ఆ ఇంటి కోడలిగా మాట్లాడిందని అనుకుంటున్నాను. ఆమె జీవితం ఆమె ఇష్టం. నాతో పాటు నా భర్త రాజకీయ జీవితం మా ఇష్టం. నేను మంత్రిగా మంచి పనితీరు కనబరుస్తున్నాను. అవినీతి ఆరోపణలు లేకుండా పనిచేస్తున్నా. ప్రజలకు సేవ చేయాలనే ఆలోచనతో ఉన్నాను. పదవిలో కొనసాగించాలని అధిష్ఠానాన్ని కోరాను.

### నాకు షోకాజ్ నోటీసు ఇవ్వడమే తప్పు..

నా బిడ్డ వ్యాఖ్యలపై నేను స్పందించను. సుస్మిత వ్యాఖ్యలతో మాకు సంబంధం లేదు. రోజూ ఎంతో మంది మాట్లాడతారు.. అందులో సుస్మిత కూడా ఒకరు. నా బిడ్డ కాబట్టి నన్ను బాధ్యురాలిని చేయడం సరికాదు. ఆమె వ్యాఖ్యలను ఖండించడం, సమర్థించడం చేయను. నా వివరణను మీనాక్షి నటరాజన్‌కు చెప్పాను. అధిష్ఠానానికి ఆమె చెప్తానన్నారు. పార్టీలో కొందరితో నాపై ఆరోపణలు చేయించారు. ఎవరు అలా చేయించారో తెలుసు. పేర్లు చెబితే వివాదం అవుతుంది. నాపై ఆరోపణలు చేసిన వారికీ షోకాజ్ నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది. పార్టీ ఆ దిశగానూ ఆలోచించాలి. నాకు షోకాజ్ నోటీసు ఇవ్వడమే తప్పు. ఏఐసీసీ సభ్యురాలిగా ఉన్నా.. అందుకే ఇక్కడికి వచ్చి నా బాధ చెప్పుకొన్నా. రాహుల్, ప్రియాంక, కేసీ వేణుగోపాల్‌కు రాతపూర్వకంగా వివరణ ఇచ్చా. పార్టీ తీసుకునే నిర్ణయం బట్టి నా ఆలోచన ఉంటుంది" అని కొండా సురేఖ అన్నారు.

# కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనలో ఎటు చూసినా విధ్వంసం, వికృతం: కేటీఆర్

మొదటిపేజీ తరువాయి

"కాంగ్రెస్ పాలనలో ఎటు చూసినా విధ్వంసం, వికృతం. కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన కాదు.. ఇది పీడన. జలద్రోహం చేస్తున్న జలగల పాలన. ఈ శతాబ్దపు అతిపెద్ద మోసం కాంగ్రెస్ మేనిఫెస్టో. పేదల భూములు నిషేధిత జాబితాలో పెట్టి 30శాతం కమీషన్లు తీసుకుంటున్నారు. అభివృద్ధి పనులు చేయకున్నా.. రాష్ట్ర ప్రభుత్వం 4.50లక్షల కోట్ల అప్పులు చేసింది. కాంగ్రెస్ అసమర్థత ప్రో మ్యాక్స్, అవినీతి అల్ట్రామ్యాక్స్, అరాచకం ఐమ్యాక్స్. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని కుక్కలు చింపిన విస్తరిలా తయారుచేసింది. రూ.50వేల కోట్లు రుణమాఫీ చేస్తామని.. రూ.20వేల కోట్లు చేశారు. రుణమాఫీ చేస్తామని.. సీఎం రేవంత్‌రెడ్డి దేవుళ్ల మీద ఒట్టుపెట్టారు. మాఫీ చేయకుండానే.. 70శాతం మంది రైతులకు కుచ్చుటోపీ పెట్టారు. తెలంగాణను దేశానికే అన్నపూర్ణగా కేసీఆర్ మారిస్తే.. కాంగ్రెస్ నాశనం చేసింది. రాష్ట్రంలో దరిద్రం దండయాత్ర మొదలుపెట్టి వెయ్యి రోజులు అయింది. రాష్ట్ర సంపదను కొల్లగొట్టే విషయంలో సీఎం, మంత్రులు కొట్టుకుంటున్నారు.

దిల్లీకి మూటలు.. పదవుల కోసం కీచులాటలు..

కాంగ్రెస్ పాలనలో దిల్లీకి మూటలు.. పదవుల కోసం కీచులాటలు తప్ప ఏం లేదు. రైతుబంధు బంద్ అయ్యింది.. రాహుల్ బంధు మొదలైంది. గోదావరి, కృష్ణా జలాల వాటాల్లో తెలంగాణకు అన్యాయం జరిగితే మిమ్మల్ని వదిలిపెట్టం. కాళేశ్వరం మీద కక్షకట్టి.. రైతులను శిక్షిస్తున్నారు. మిస్ వరల్డ్ పోటీలు, మెస్సీ కోసం నిధులు భారీగా ఖర్చు చేస్తారు. కానీ, రైతులకు నీళ్లు ఇచ్చేందుకు మాత్రం డబ్బులు ఖర్చు పెట్టరు. కాంగ్రెస్ వచ్చిన ఏడాదిలోనే 2లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారు. జాబ్ క్యాలెండర్ పేరిట.. జాబ్‌లెస్ క్యాలెండర్ ఇచ్చారు. దిల్లీలో రాహుల్ జెన్ జీని వెంటపెట్టుకొని.. ప్రజాస్వామ్యమని కొటేషన్లు చెబుతున్నారు. తెలంగాణలో మాత్రం నిరుద్యోగులపై దాడులు జరుగుతున్నాయి" అని విమర్శించారు. మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో పాటు పలువురు సీనియర్ నేతలు సమావేశంలో పాల్గొన్నారు.

# అయోధ్య రామాలయ తొలి సీఈవోగా జితేంద్ర మిశ్ర

మొదటిపేజీ తరువాయి

అయోధ్య: ఉత్తర్‌ప్రదేశ్‌లోని అయోధ్య రామాలయ తొలి సీఈవోగా విశ్రాంత ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్ర ఎంపికయ్యారు. ఆయన దాదాపు 39 ఏళ్లపాటు వాయుసేనలో సేవలందించారు. సీఈవో పోస్టు కోసం ముగ్గురు సభ్యుల ఎంపిక కమిటీ 5,585 దరఖాస్తులను పరిశీలించింది. 16 మందిని ఇంటర్వ్యూ చేసింది. ముగ్గురి పేర్లతో కూడిన తుది జాబితాను శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టుకు అందజేయగా.. బుధవారం సమావేశమైన ట్రస్టు సభ్యులు జితేంద్ర మిశ్ర పేరును ఖరారు చేశారు. మరోవైపు.. ట్రస్టు నూతన ప్రధాన కార్యదర్శిగా గోవింద్ దేవ్ గిరి ఎంపికయ్యారు. మదన్‌మోహన్ పాండే (అయోధ్య), మహేశ్ భాగ్‌చంద్కా (దిల్లీ), డా.నిర్మలా యాదవ్ (శికోహాబాద్)లు కొత్త ట్రస్టీలుగా నియమితులయ్యారు.

విరాళాల దుర్వినియోగం ఆరోపణల నేపథ్యంలో అయోధ్య రామాలయంలో పరిపాలన, ఆర్థిక కార్యకలాపాల నిర్వహణను బలోపేతం చేసేందుకు ట్రస్టు చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా సీఈవో నియామకం చేపట్టింది. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన జితేంద్ర మిశ్ర 1986లో భారత వైమానిక దళంలో ఫైటర్ పైలట్‌గా చేరారు. ఆపరేషన్ సిందూర్ సమయంలోనూ వెస్ట్రన్ ఎయిర్ కమాండ్‌కు నాయకత్వం వహించారు. ఆ సమయంలో అందించిన సేవలకుగానూ యుద్ధసేవా పతకం పొందారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో పదవీ విరమణ చేశారు. ఆయన పుణెలోని నేషనల్ డిఫెన్స్ అకాడమీ, బెంగళూరులోని ఎయిర్ ఫోర్స్ టెస్ట్ పైలట్స్ స్కూల్ పూర్వవిద్యార్థి.

# బెంగళూరు ట్రాఫిక్ కష్టాలు.. కర్ణుడికీ తప్పలేదట!

మొదటిపేజీ తరువాయి

బెంగళూరులో 'వర్క్‌ఫ్రమ్ ఆఫీస్' అనే కంటే 'వర్క్ ఫ్రమ్ ట్రాఫిక్' అనడం సమంజసం అంటూ కొందరు సెటైర్లు వేస్తుంటారు. గూగుల్ మ్యాప్స్‌నకు సైతం మెంటలెక్కించడం బెంగళూరు రోడ్ల స్పెషాలిటీ అంటూ మీమ్స్ వేస్తుంటారు. ప్రభుత్వాలు మారినా.. పెరుగుతోన్న జనాభా, వాహన విస్ఫోటం వల్ల ట్రాఫిక్ కష్టాలు నగర వాసులను ఏళ్లుగా వెంటాడుతున్నాయి. గతంలో కిరణ్ మజుందార్ షా, మోహన్‌దాస్ పాయ్ వంటి ప్రముఖులే రహదారుల దుస్థితిపై గళమెత్తారు. ప్రభుత్వం కూడా చర్యలు చేపడుతోంది. ఈ క్రమంలో బెంగళూరు రోడ్లపై ఓ ఫన్నీ జోక్ సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. పూర్వం రోజుల్లో కర్ణుడికీ ట్రాఫిక్ కష్టాలు తప్పలేదని, నేటి కష్టాలకు ఆయన శాపమూ కారణమని ఎవరో ఓ సెటైరిక్ పోస్ట్ క్రియేట్ చేశారు.

వైరల్ అవుతున్న సోషల్‌మీడియా పోస్టు ఇదీ

ఈ విషయం కొందరికే తెలుసు!

కర్ణ- అర్జునుడి మధ్య చోళ రాజ్యానికి సమీపంలో.. అంటే సరిగ్గా నేటి బెంగళూరు పరిసరాల్లో చారిత్రక యుద్ధం జరిగింది.

ఆ ఉదయం కర్ణుడు "ఈరోజు సూర్యాస్తమయంలోపు ఎట్టిపరిస్థితుల్లో అర్జునుడిని మట్టికరిపిస్తా!" అని శపథం చేశాడు.

ఆత్మవిశ్వాసంతో కర్ణుడు రథం ఎక్కాడు. గుర్రాలు సైతం ఫార్ములా-1 రేసుకు సిద్ధమైనట్టు రెడీ అయ్యాయి.

అర్జునుడు కూడా ఎంతో దూరంలో లేడు. (ఇప్పటి లెక్కల్లో అయితే రెండు జంక్షన్ల అవల)

కర్ణుడు మీసాలు మెలేస్తూ.. "క్షణాల్లో అక్కడికి చేరుకుంటా. అర్జునుడిని ఓడిస్తా" అంటూ బయల్దేరాడు.

బయల్దేరే సమయంలో పాపం కర్ణుడికి తెలీదు. ఇవి బెంగళూరు రోడ్లు అని. ట్రాఫిక్‌కు నిలయమని!!

అప్పటికే బయల్దేరి చాలా సేపైంది. రథం కొంచెం కూడా కదల్లేదు. 'ఇదేంటి శల్యా' అంటూ కర్ణుడు బిగ్గరగా అరిచాడు.

"మహారాజా! ఇది పీక్ అవర్. ఈ టైంలో ఇటువైపు రావడానికి దేవుళ్లు కూడా భయపడతారు" అంటూ శల్యుడి నుంచి సమాధానం.

ఓ వైపు మెట్రో పనులు. మరోవైపు సర్వీసు రోడ్లలో అడ్డుగా ఆవులు. ఇంకెంతసేపో చూద్దామంటే.. ప్రతి రెండు నిమిషాలకీ గూగుల్ మ్యాప్స్‌లో 'రీకాలిక్యులేటింగ్' అంటూ సమయం పెరిగిపోతోంది.

కర్ణుడికి అసహనం పెరిగిపోతోంది. ఓ వైపు సూర్యాస్తమయం అవుతోంది. అల్లంత దూరంలో అర్జునుడు ఫిల్టర్ కాఫీ తాగుతూ, రీల్స్ చూస్తూ కనిపిస్తున్నాడు. కాసేపట్లో చేరుకుంటే నాదే అనుకుంటూ కర్ణుడు వేగంగా వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నాడు.

సరిగ్గా అప్పుడే 'ధడేల్'మంటూ శబ్దం. చూస్తే రథం చక్రం రోడ్డుపై ఉన్న భారీ గుంతలో కూరుకుపోయింది. ఎంత ప్రయత్నించినా పైకి రాలేదు. కర్ణుడికి ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఆక్రోశంతో ఆకాశం వైపు చూస్తూ "ఈ నేలపై ఏ చక్రం కూడా సాఫీగా తిరగకూడదు గాక" అని శపించాడు.

అలా కర్ణుడు ఎక్కడైతే అటకాయించబడ్డాడో (ఇరుక్కుపోయాడో).. ఆ ప్రాంతమే కాలక్రమేణా 'కర్ణ-అటక' (కర్ణాటక)గా మారింది!

# కేటీఆర్ హద్దు మీరి మాట్లాడితే ప్రజలు క్షమించరు: మంత్రి పొంగులేటి

మొదటిపేజీ తరువాయి




"రైతే రాజుగా కాంగ్రెస్ పాలన కొనసాగుతోంది. వరి వేస్తే ఉరేనని ఆనాటి దొర అన్నారు. మా ప్రభుత్వం రాగానే ఆ పంటకు బోనస్ ఇస్తున్నాం. వరి సాగులో దేశంలోనే ప్రథమ స్థానం సాధించాం. గత ప్రభుత్వం నిరుద్యోగులను విస్మరించింది. గ్రూప్-1 ప్రశ్నపత్రాలను అమ్ముకున్నారు. మా ప్రభుత్వం రాగానే టీజీపీఎస్సీని ప్రక్షాళన చేశాం. కోర్టు ద్వారా గ్రూప్-1 నియామకాలు ఆపాలని చూశారు. ఇటీవలే 10వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చాం. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతిహామీని నెరవేరుస్తున్నాం. గత ప్రభుత్వ బకాయిలు, అప్పులను చెల్లిస్తున్నాం. పేదలకు సంక్షేమ పథకాలు అందించాలనే తపనతో పనిచేస్తున్నాం.

బీఆర్ఎస్ నేతల ఉద్యోగాలను ఊడగొట్టారని ప్రజలను వారు రెచ్చగొడుతున్నారు. ప్రభుత్వం చేసిన ఏ కార్యక్రమాన్నీ ప్రతిపక్షాలు ప్రశంసించలేదు. ఉప ఎన్నికల్లో ఎన్ని పొర్లుదండాలు పెట్టినా కాంగ్రెస్ గెలిచింది. ఓడినా బీఆర్ఎస్‌కు జ్ఞానోదయం కాలేదు. ప్రజలు అసహ్యించుకుంటున్నా ఆ పార్టీ నేతలు మారలేదు. గతంలో బతుకమ్మ చీరల్లోనూ అవినీతికి పాల్పడ్డారు. కేటీఆర్ హద్దు మీరి మాట్లాడితే ప్రజలు క్షమించరు. రాహుల్‌గాంధీని ఉద్దేశించి ఆయన సంస్కారహీనంగా మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో ధనిక రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చారు. పదేళ్లపాటు పేదలకు రేషన్‌కార్డులు కూడా ఇవ్వలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లలోపే కొత్తగా 15లక్షల కార్డులు ఇచ్చింది. కొత్తగా దాదాపు 3 లక్షల మంది వితంతువులు, వృద్ధులకు పింఛన్లు ఇవ్వనున్నాం" అని పొంగులేటి అన్నారు.

# వేములవాడలో ఘనంగా పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు

**- రాజన్నకు ప్రత్యేక పూజలు చేసిన డా. బండారి రాజ్‌కుమార్, డా. సాయి కృష్ణ ప్రియ**





వేములవాడ / సెప్టెంబర్ 2 ప్రజదివాన్

జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ గారి జన్మదిన వేడుకలను వేములవాడ జనసేన ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ డా. బండారి రాజ్‌కుమార్, డా. సాయి కృష్ణ ప్రియ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.పవన్ కళ్యాణ్ గారి జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పవన్ కళ్యాణ్ గారు సంపూర్ణ ఆయురారోగ్యాలతో ఉండాలని, ప్రజాసేవలో మరింత ఉన్నతస్థాయికి ఎదగాలని రాజన్నను ప్రార్థించినట్లు డా. బండారి రాజ్‌కుమార్ తెలిపారు.ఈ సందర్భంగా డా. బండారి రాజ్‌కుమార్ మాట్లాడుతూ, “దక్షిణ కాశిగా ప్రసిద్ధి చెందిన వేములవాడ రాజన్న క్షేత్రానికి పవన్ కళ్యాణ్ గారు త్వరలోనే రావాలని కోరుకుంటున్నాం. రాజన్న ఆశీస్సులు తీసుకునేందుకు పవన్ కళ్యాణ్ గారి వేములవాడ పర్యటన త్వరలోనే జరిగేలా ప్రయత్నిస్తాం. ఆయనకు ఘన స్వాగతం పలికేందుకు వేములవాడ జనసేన కుటుంబం సిద్ధంగా ఉంది” అని పేర్కొన్నారు.డా. సాయి కృష్ణ ప్రియ మాట్లాడుతూ, పవన్ కళ్యాణ్ గారి ఆశయాలు యువతతో పాటు మహిళలను కూడా ప్రజాసేవ వైపు నడిపిస్తున్నాయని అన్నారు. ఆయన మరెన్నో సంవత్సరాలు ప్రజలకు సేవ చేస్తూ ఆరోగ్యంగా, విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో వేములవాడ జనసైనికులు నరేష్, రోహిత్, పవన్, సాదులతో పాటు పలువురు జనసేన నాయకులు, జనసైనికులు పాల్గొన్నారు. పవన్ కళ్యాణ్ గారి జన్మదిన వేడుకలను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

# ముస్తాబాద్ లో వైయస్సార్ వర్ధంతి వేడుకలు



ముస్తాబాద్/ సెప్టెంబర్ 2 ప్రజా దివాన్

ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిల్చిన మహా నేత వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి వర్ధంతి ని ముస్తాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గజ్జెల రాజు ఆధ్వర్యంలో ముస్తాబాద్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వైయస్సార్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాగు నీటి ప్రాజెక్టులు, ఔటర్ రింగు రోడ్డు వంటి అభివృద్ధి పనులు,రుణమాఫీ,ఫీజు రీయింబర్స్‌మెంట్,ఆరోగ్యశ్రీ వంటి సంక్షేమ పథకాలతో పాలనపై చెరగని ముద్ర వేసిన నాయకుడు మరియు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో తనదైన ముద్ర వేసి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహా నేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి అని గజ్జెల రాజు అన్నారు కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఏళ్ళ బాల్ రెడ్డి ఆత్మ కమిటీ చైర్మన్ కొండం రాజిరెడ్డి, ఏఎంసి వైస్ చైర్మన్ వెలుముల రాంరెడ్డి,యూత్ కాంగ్రెస్ ఆరుట్ల మహేష్, ఎన్ ఎస్ యు ఐ వర్కింగ్ ప్రెసిడెంట్ భానుకుమార్,యూత్ మండల అధ్యక్షులు రంజాని నరేష్, సీనియర్ నాయకులు ఎదునూరి భానుచందర్, మరియు తలారినర్సయ్య,గ్రామ అధ్యక్షులు కొప్పు రమేష్, ఎన్ ఎస్ యు ఐ దబ్బెడ భాను,బండారి సాయి, సురేష్.దేవయ్య. దేవరాజు, మరియు కాంగ్రెస్ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

# వైఎస్సార్ ఆశయాల సాధనకు కాంగ్రెస్ శ్రేణులు కృషి చేయాలి

**- రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**- వేములవాడలో ఘనంగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమం**







వేములవాడ / సెప్టెంబర్ 02 ప్రజాదివాన్

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా వేములవాడ పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన వర్ధంతి కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొని వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు...ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా వైఎస్సార్ పనిచేశారని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడంతో పాటు ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకునేందుకు మండుటెండల్లో సుదీర్ఘ పాదయాత్ర చేపట్టి ప్రజల మన్ననలు పొందారని గుర్తుచేశారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం పేదల సంక్షేమం, రైతుల అభివృద్ధి, విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు.రైతులకు ఉచిత విద్యుత్ అందించేందుకు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే తొలి సంతకం చేసిన ఘనత వైఎస్సార్‌కు దక్కుతుందన్నారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పిస్తూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారని, జలయజ్ఞం ద్వారా అనేక సాగునీటి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారని తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మాణానికి పునాది వేసి, పలు రిజర్వాయర్లు, కాలువల నిర్మాణానికి మార్గం సుగమం చేశారని పేర్కొన్నారు.2006లో వేములవాడ నియోజకవర్గంలోని మల్యాల వద్ద జరిగిన ఇందిరమ్మ గ్రామసభకు వైఎస్సార్ హాజరై ఈ ప్రాంత అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేశారని గుర్తుచేశారు. ఎల్ఎండీ ప్రాజెక్టు ద్వారా వరద కాలువ నీటిని మళ్లించి ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేందుకు ఆనాడే ప్రణాళికలు రూపొందించారని తెలిపారు.పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించాలనే లక్ష్యంతో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రవేశపెట్టిన ఘనత కూడా వైఎస్సార్‌కే దక్కుతుందన్నారు. పేదలకు ఉచిత వైద్యం అందించేందుకు రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలు చేసి లక్షలాది కుటుంబాలకు వైద్య భరోసా కల్పించారని తెలిపారు. వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధికి కూడా వైఎస్సార్ హయాంలో నిధులు కేటాయించారని గుర్తుచేశారు.వైఎస్సార్ మరణం కాంగ్రెస్ పార్టీకి, ప్రజలకు తీరని లోటని నాయకులు అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో గతంలో నిలిచిపోయిన ప్రాజెక్టులను తిరిగి కొనసాగిస్తూ సాగునీటి రంగానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. కాళేశ్వరం సూరమ్మ ప్రాజెక్టు భూసేకరణకు రూ.80 కోట్లు కేటాయించి పనులను ముందుకు తీసుకెళు న్నారని పేర్కొన్నారు.

వైఎస్సార్ ఆశయాల సాధనకు కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తామని, రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చూడాలనే లక్ష్యంతో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ శ్రేణులంతా ఐక్యంగా ముందుకు సాగుతామని నాయకులు తెలిపారు.

# సిరిసిల్లలో కాంగ్రెస్ పాలన పై నిరసన కార్యక్రమం

ముస్తాబాద్ / సెప్టెంబర్ 2 ప్రజా దివాన్




కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజుల పాలనలో ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు చేపట్టిన ఏడు రోజుల నిరస కార్యక్రమంలో భాగంగా జిల్లా అధ్యక్షులు తోట అగయ్య ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు ‘బాకీ కార్డులు’ పంపిణీ చేసి, 420 అడుగుల ఫ్లెక్స్ ప్రదర్శనతో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. కార్యక్రమంలో నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, తుల ఉమ, చీటి నర్సింగారావు, ముస్తాబాద్ మాజీ ఎంపీపీ జనగామ శరత్‌రావు, చీటి వెంకట నరసింహారావు బొంపల్లి సురేందర్‌రావు, రాసమడుగు సంతోష్ రావు,మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళా చక్రపాణి , కొండ శ్రీనివాస్‌గౌడ్, శీలం స్వామి, అంజిరెడ్డి, నరసింహారెడ్డి, మెంగనీ మనోహర్, కౌన్సిలర్లు, ఏదునూరి శ్రీనివాస్, మండల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చందుర్తి పీహెచ్‌సీలో డీఎంహెచ్ఓ ఆకస్మిక తనిఖీ

**- టీకా కార్యక్రమం, జాతీయ ఆరోగ్య పథకాల అమలుపై సమీక్ష**

**- అర్హులైన ప్రతి చిన్నారికి సమయానికి టీకాలు అందేలా చర్యలు తీసుకోవాలి: డీఎంహెచ్ఓ డా. ఏంజెలా ఆల్ఫ్రెడ్**



చందుర్తి మండలం / సెప్టెంబర్ 2 ప్రజాదివాన్

రాజన్న సిరిసిల్ల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. ఏంజెలా ఆల్ఫ్రెడ్ బుధవారం చందుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, అనంతరం మర్రిగడ్డ, మూడపల్లె ఆరోగ్య ఉపకేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పీహెచ్‌సీతో పాటు ఉపకేంద్రాల్లో నిర్వహిస్తున్న యూనివర్సల్ ఇమ్యునైజేషన్ ప్రోగ్రామ్ (యూఐపీ) సెషన్లను పరిశీలించారు. చిన్నారులకు అందిస్తున్న టీకాల కార్యక్రమం, టీకాల నిల్వలు, రికార్డుల నిర్వహణను తనిఖీ చేసి సంబంధిత సిబ్బందికి సూచనలు చేశారు.అనంతరం పీహెచ్‌సీ పరిధిలో అమలవుతున్న వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.ప్రత్యేకంగా టీకా కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేసి, అర్హులైన ప్రతి చిన్నారికి నిర్ణీత షెడ్యూల్ ప్రకారం టీకాలు అందేలా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్ఓ సూచించారు.ఈ తనిఖీలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా. సంపత్ కుమార్, వైద్యాధికారి డా. వేణు మాధవ్, వీసీసీఎం నవీనతో పాటు వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# బొప్పాపూర్ లో విషాదం.. దిక్కులేని స్థితిలో వృద్ధుడి మరణం

**- దుర్వాసన రావడంతో వెలుగులోకి... ఇంట్లోనే కుళ్ళిపోయిన మృతదేహం లభ్యం**

ఎల్లారెడ్డిపేట మండలం / సెప్టెంబర్ 02 ప్రజాదివాన్



రాజన్నసిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ గ్రామానికి చెందిన మిడిదొడ్డి శంకరయ్య (75) అనారోగ్యంతో మృతి చెందారు. స్థానికుల కథనం ప్రకారం శంకరయ్య వారం రోజుల క్రితం అనారోగ్యానికి గురికాగా, గత మూడు రోజులుగా మంచానికే పరిమితమయ్యారు. ఇంట్లో నుంచి ఆయన బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చిన స్థానికులు బుధవారం ఉదయం తలుపులు తెరిచి చూడగా మృతి చెంది కనిపించారు. మృతదేహం కుళ్ళిపోయి దుర్వాసన వస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. శంకరయ్యకు భార్య, కుటుంబ సభ్యులు ఎవరూ లేకపోవడంతో అంత్యక్రియలు నిర్వహించడానికి దాతలు ముందుకు వచ్చి ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఒంటరిగా ఉన్న వృద్ధుడు ఇలా మృతి చెందడం స్థానికులను తీవ్రంగా కలచివేసింది.

# గూడెం గ్రామంలో బోరు మోటర్ పైప్ లైన్ పూజా కార్యక్రమం

ముస్తాబాద్/ సెప్టెంబర్ 2 ప్రజా దివాన్

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం గూడెం గ్రామంలో ఇటీవల నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో త్రాగునీటి కొరత తీర్చడం కొరకు నూతనంగా బోరు మోటర్ పైప్ లైన్ పనులను చేయుటకు గ్రామ సర్పంచ్ తాటిపల్లి శంకర్ ఆధ్వర్యంలో భూమి పూజ చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డబుల్ బెడ్రూం ఇండ్లలో ఉన్న ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు లేకుండా పైపులు ఏర్పాటు చేసి త్రాగునీరు అందించడానికి పనులను నిర్వహిస్తున్నామని వారన్నారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వార్డు సభ్యులు గ్రామ ప్రజలు తాజా మాజీ నాయకులు పాల్గొన్నారు



# సైబర్ భద్రతలో ముందస్తు అప్రమత్తతే ముఖ్యం.

**- సైబర్ నేరాల నివారణలో విద్యార్థుల భాగస్వామ్యమే కీలకం.**
**- సైబర్ నేరాలపై అవగాహన పెంపొందించుకోవాలి: జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే.**

రాజన్న సిరిసిల్ల జిల్లా / సెప్టెంబర్ 02 ప్రజాదివాస్

తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (౧+జూదీ) ఆధ్వర్యంలో ప్రతి నెల మొదటి బుధవారం నిర్వహించే కార్యాక్రమంలో భాగంగా జిల్లా సైబర్ టీమ్ ఆధ్వర్యంలో బుధవారం రోజున నర్సింగ్ కళాశాలలో విద్యార్థుల కోసం నిర్వహించిన సైబర్ నేరాల అవగాహన కార్యక్రమనికి జిల్లా ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై అవగాహన కల్పించారు.అనంతరం ఎస్పీ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడాతు..నేటి డిజిటల్ యుగంలో సాంకేతికత ఎంత వేగంగా అభివృద్ధి చెందుతోందో, అదే స్థాయిలో సైబర్ నేరాలు కూడా పెరుగుతున్నాయని , సైబర్ నేరాల బారిన పడకుండా ఉండేందుకు ముందస్తు అప్రమత్తతే ముఖ్యమని తెలిపారు.సైబర్ నేరగాళ్లు అనుసరిస్తున్న నూతన మోసపూరిత విధానాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని , ముఖ్యంగా విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియా ద్వారా నకిలీ అకౌంట్లు, ఫేక్ లింకులు, పార్ట్‌టైమ్ ఉద్యోగాలు, స్కాలర్‌షిప్‌లు, గిఫ్ట్ ఆఫర్లు, లక్కీ డ్రా పేర్లతో మోసాలు జరుగుతున్నాయని తెలిపారు.తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, వీడియో కాల్స్, సందేశాలు లేదా లింకులను నమ్మవద్దని, ఓటీపీ, బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం పిన్, సీవీవీ నంబర్, ఆధార్ వివరాలు, పాస్‌వర్డ్‌లు వంటి వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. అత్యాశ, భయం, అత్యవసర పరిస్థితులను ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు మోసాలు చేస్తున్నారన్నారు. విద్యార్థులు చదువుతో పాటు సైబర్ నేరాలపై అవగాహన పెంపొందించుకోని, కుటుంబ సభ్యులు, స్నేహితులకు సైబర్ భద్రతపై అవగాహన కల్పించి , సైబర్ నేరాల నివారణలో కీలక పాత్ర పోషించాలన్నారు.సైబర్ మోసానికి గురైన వెంటనే భయభ్రాంతులకు గురికాకుండా 1930కు కాల్ చేసి లేదా చీఫ్ఱశీఖ్ఱశ్రీ జుఎవతీ జతీఱవ =వజూశీతీఱఅస్త్రూశీఖ్ఱశ్రీ ద్వారా ఫిర్యాదు చేయాలని జిల్లా ఎస్పీ తెలిపారు.వినాయకుడి బోధనలతో సైబర్ భద్రతపై అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించిన జిల్లా ఎస్పీ.తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో వినాయక చవితి సందర్భంగా రూపొందించిన సైబర్ భద్రత అవగాహన పోస్టర్‌ను విద్యార్థులతో కలిసి ఆవిష్కరించారు. వినాయకుడి నుంచి సైబర్ భద్రత పాఠాలు’ అనే సందేశంతో రూపొందించిన పోస్టర్‌లో సైబర్ మోసాల పట్ల ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వినూత్నంగా వివరించడం జరిగింది.జిల్లా సైబర్ సెల్ టీమ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన.విద్యార్థులకు లోన్ యాప్స్, షేర్ మార్కెట్, ఏపీకే ఫైల్స్, కొరియర్ ,క్రెడిట్ కార్డ్,మ్యాట్రి మోని,లాటరీ గిఫ్ట్,మల్టీ లెవల్ మార్కెటింగ్ ,క్రిప్టో కరెన్సీ, డిజిటల్ అరెస్ట్,



లాటరీ ఫ్రాడ్, గిఫ్ట్ ఫ్రాడ్ సోషల్ మీడియా తదితర మోసలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

**ఈసందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ...**

‘హతీవజవత్ఱశీఅ ఱం దీవ్‌వతీ ష్ఖుఅ జబతీవ” అనే విధంగా సైబర్ భద్రతలో ముందస్తు అప్రమత్తతే ముఖ్యమని, సైబర్ నేరాలపై తమకు కల్పించిన అవగాహన ఎంతో ఉపయోగకరంగా ఉందని విద్యార్థులు తెలిపారు.సైబర్ నేరాల నివారణలో విద్యార్థులు కూడా తమ వంతు బాధ్యతగా తీసుకుని, కుటుంబ సభ్యులు, స్నేహితులకు సైబర్ భద్రతపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. అవగాహన సదస్సులో డిఎస్పీ నాగేంద్రచారి, సి.ఐ శ్రీనివాస్, సైబర్ క్రైమ్ ఎస్.ఐ జునైద్,నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ అనిత, సైబర్ సెల్ సిబ్బంది గంగిరెడ్డి, రాజు,శ్రీకాంత్ , విజేయ్, కలశాల అధ్యాపక బృదం, విద్యార్థులు పాల్గొన్నారు.

# మహిళా సర్పంచులకు MCRHRDలో మూడ్రోజుల శిక్షణ

**- గ్రామాభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలి: సర్పంచులు**
**- చట్టసభల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి**
**- శిక్షణ పూర్తి చేసిన సిరిసిల్ల జిల్లా మహిళా సర్పంచులకు ప్రశంసా పత్రాలు**

హైదరాబాద్ / సెప్టెంబర్ 2 ప్రజాదివాస్



హైదరాబాద్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (వీజ=౧=ఐ) ఆధ్వర్యంలో ఎన్నికైన మహిళా సర్పంచుల కోసం నిర్వహించిన మూడు రోజుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమం బుధవారంతో విజయవంతంగా ముగిసింది. ఈ శిక్షణలో రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన కోనరావుపేట మండలం బావుసాయిపేట సర్పంచ్ యాస్మిన్ పాషా, వేములవాడ రూరల్ మండలం అనుపురం సర్పంచ్ శేర్ల రాజేశ్వరి, చంద్రగిరి సర్పంచ్ ముత్త సంజన, ఇల్లంతకుంట మండలం జంగారెడ్డిపల్లె సర్పంచ్ సునీతతో పాటు పలువురు మహిళా ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 2 వరకు కొనసాగిన ఈ శిక్షణలో గ్రామ పంచాయతీ పరిపాలన, స్థానిక అభివృద్ధి ప్రణాళికల రూపకల్పన, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, నిధుల సమర్థ వినియోగం, గ్రామీణాభివృద్ధిలో మహిళా ప్రజాప్రతినిధుల పాత్ర తదితర అంశాలపై నిపుణులు సమగ్ర అవగాహన కల్పించారు.శిక్షణ విజయవంతంగా పూర్తిచేసుకున్న అనంతరం సర్పంచులకు నిర్వాహకులు ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా సర్పంచులు మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో మహిళల భాగస్వామ్యాన్ని మరింత పెంచాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామ పంచాయతీలతో పాటు శాసనసభ, పార్లమెంట్ వంటి చట్టసభల్లోనూ మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ప్రభుత్వాలను కోరారు.మహిళలు పరిపాలనా రంగంలో కీలక పాత్ర పోషిస్తే పారదర్శకత, బాధ్యతాయుత పాలన సాధ్యమవుతుందని పేర్కొన్నారు. వీజ=౧=ఐలో పొందిన శిక్షణ గ్రామాల అభివృద్ధి ప్రణాళికల రూపకల్పన, స్వయం సమృద్ధి సాధనలో ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.తాము ప్రాతినిధ్యం వహిస్తున్న గ్రామాల సమగ్రాభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని సర్పంచులు స్పష్టం చేశారు. సీసీ రోడ్లు, మురుగునీటి పారుదల వ్యవస్థ, పరిశుభ్రత, తాగునీటి సరఫరా, వీధిదీపాల నిర్వహణ వంటి ప్రాథమిక సౌకర్యాల మెరుగుదలతో పాటు గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు.గ్రామాభివృద్ధి ఒక్కరితో సాధ్యమయ్యేది కాదని, ప్రజాప్రతినిధులు, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు సమిష్టిగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రజల సహకారంతోనే గ్రామాలను సమగ్ర అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లగలమని వారు పేర్కొన్నారు.
20

# రేపు రగుడు సాయిమణికంఠ ఫంక్షన్ హాల్‌లో కార్యక్రమం

**- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చేతుల మీదుగా లబ్ధిదారులకు ధృవపత్రాల అందజేత**

రాజన్న సిరిసిల్ల జిల్లా / సెప్టెంబర్ 2 ప్రజాదివాస్

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల పథకం ఫేజ్-1 కింద మంజూరైన గృహాల లబ్ధిదారులకు ధృవపత్రాల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం (03-09-2026) నిర్వహించనున్నట్లు తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమం ఉదయం 10 గంటలకు రగుడు గ్రామంలోని సాయిమణికంఠ ఫంక్షన్ హాల్‌లో జరగనుంది. రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే శ్రీ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు ధృవపత్రాలు అందజేయనున్నారు.కార్యక్రమానికి మార్కెట్ కమిటీ ఛైర్మన్లు, సర్పంచ్‌లు, ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులు, సంబంధిత అధికారులు మరియు లబ్ధిదారులు హాజరై విజయవంతం చేయాలని తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ కోరారు.కార్యక్రమ వివరాలు:స్థలం: సాయిమణికంఠ ఫంక్షన్ హాల్, రగుడుతేదీ: 03-09-2026 సమయం: ఉదయం 10:00 గంటలకు.



పత్రికా ప్రకటన ప్రచురణ నిమిత్తము

ఇందిరమ్మ ఇండ్ల పథకం – ఫేజ్-1 ధృవపత్రాల పంపిణీ కార్యక్రమం

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల పథకం ఫేజ్-1 కింద మంజూరైన ఇళ్లకు సంబంధించిన ధృవపత్రాల పంపిణీ కార్యక్రమం శ్రీ ఆది శ్రీనివాస్, గౌరవ ప్రభుత్వ విప్ మరియు గౌరవ శాసనసభ్యులు, వేములవాడ గారి చేతుల మీదుగా, రేపు తేదీ అనగా 03-09-2026 ఉదయం 10:00 గంటలకు, రగుడు నందలి సాయిమణికంఠ ఫంక్షన్ హాల్ నందు నిర్వహించబడుతుంది. కావున గౌరవ మార్కెట్ కమిటీ ఛైర్మన్ లు , గౌరవ సర్పంచ్ లు, ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులు, మరియు సంబంధిత లబ్దిదారులు నిర్ణీత సమయానికి కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయగలరని తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్, రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ గారు కోరడమైనది.

స్థలం: సాయిమణికంఠ ఫంకషన్ హాల్, రగుడు
తేదీ: 03-09-2026,
సమయం: ఉదయం 10:00 గంటలకు.

దీని ప్రతులు:
సమస్త పత్రికా విలేకరులకు ప్రచురణ నిమిత్తమై.

ప్రాజెక్ట్ డైరెక్టర్,
తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్,
రాజన్న సిరిసిల్ల జిల్లా.

# ఆనారోగ్య సమస్యలతో వృద్ధురాలు ఉరివేసుకుని ఆత్మహత్య

**- కొనరావుపేట మండలం ధర్మారంలో ఘటన**
**- కసు నమోదు చేసిన ఎస్సై బండారి రామ్మోహన్**

కొనరావుపేట మండలం / సెప్టెంబర్ 02 ప్రజాదివాస్



ఆనారోగ్య సమస్యలు, ఒంటరితనంతో బాధపడుతూ ఓ వృద్ధురాలు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన కొనరావుపేట మండల పరిధిలోని ధర్మారం గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. ?పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ధర్మారం గ్రామానికి చెందిన వంగపల్లి రాజవ్వ (80, భర్త: రాజయ్య) గత కొంతకాలంగా వివిధ ఆరోగ్య సమస్యలతో పాటు ఒంటరితనంతో బాధపడుతోంది. ఈ క్రమంలో బుధవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో తీవ్ర మనస్తాపానికి గురై, ఇంటి దూలానికి చీరతో ఉరివేసుకుని ప్రాణాలు విడిచింది. ?మృతురాలి కుమారుడు వంగపల్లి వెంకటి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు కొనరావుపేట ఎస్సై బండారి రామ్మోహన్ తెలిపారు.

# నూకలమర్రిలో మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి ఘన నివాళులు

**వైఎస్సార్ ఆశయాలను ముందుకు తీసుకెళ్తాం: వకుళభరణం శ్రీనివాస్, రొమాల ప్రవీణ్**

వేములవాడ / సెప్టెంబర్ 02 ప్రజాదివాస్



వేములవాడ గ్రామీణ మండలం నూకలమర్రి గ్రామంలో యూత్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రోమాల ప్రవీణ్ ఆధ్వర్యంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ప్రధాన కార్యదర్శి వకుళభరణం శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ, వైయస్ రాజశేఖర్ రెడ్డి తన పాలనలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ఇప్పటికీ ప్రజల గుండెల్లో నిలిచిపోయాయని కొనియాడారు. పేద ప్రజల సంక్షేమం, రైతు సంక్షేమమే ధ్యేయంగా ఆయన అహర్నిశలు శ్రమించారని, ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి వకుళభరణం శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ డయాగ్నస్టిక్ హబ్‌పై డీఎంహెచ్‌ఓ ఆకస్మిక తనిఖీ

**- ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలే లక్ష్యం: డాక్టర్ ఏంజెలా ఆల్ఫ్రెడ్**
**- పరీక్షల నాణ్యత, నమూనాల సేకరణ, రికార్డుల నిర్వహణపై సమీక్ష ఉచిత డయాగ్నస్టిక్ సేవలను మరింత సమర్థవంతంగా అందించాలని సూచన**

రాజన్న సిరిసిల్ల జిల్లా / సెప్టెంబర్ 2 ప్రజాదివాస్




రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని తెలంగాణ డయాగ్నస్టిక్ హబ్‌ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌ఓ) డాక్టర్ ఏంజెలా ఆల్ఫ్రెడ్ ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు.ఈ సందర్భంగా డయాగ్నస్టిక్ హబ్‌లో నిర్వహిస్తున్న వివిధ రకాల వైద్య పరీక్షలు, నమూనాల సేకరణ విధానం, పరీక్షల నాణ్యత, రికార్డుల నిర్వహణ, పరీక్షల ఫలితాలను రోగులకు అందించే ప్రక్రియ తదితర అంశాలను ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు సకాలంలో అందేలా అన్ని చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.ప్రభుత్వం అందిస్తున్న ఉచిత డయాగ్నస్టిక్ సేవలను ప్రజలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకునేలా మరింత సమర్థవంతంగా పనిచేయాలని డీఎంహెచ్‌ఓ సూచించారు. పరీక్షల ఫలితాలను వేగవంతంగా అందించడంతో పాటు సేవల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు.ఈ తనిఖీలో టీ-హబ్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, వైద్య సిబ్బంది మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# భారతి రీ సర్వేలో ఖచ్చితత్వమే లక్ష్యం

- భూముల వివరాల్లో పొరపాట్లకు తావులేకుండా చర్యలు సర్వాయిపల్లిలో రోవర్ యంత్రాలతో రీ సర్వే పనుల పరిశీలన
- రైతులకు ముందస్తు సమాచారం అందించి నిబంధనల మేరకు సర్వే నిర్వహించాలని ఆదేశం అధికారులు, సర్వేయర్లకు పలు సూచనలు చేసిన అదనపు కలెక్టర్ గడ్డం నగేష్





ఎల్లారెడ్డిపేట మండలం / సెప్టెంబర్ 2 ప్రజాదివాస్

భూముల యాజమాన్య హక్కులు, రికార్డుల ఖచ్చితత్వాన్ని నిర్ధారించే భూ భారతి రీ సర్వే ప్రక్రియను ఎలాంటి లోపాలకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో భూ రికార్డుల ఆధునీకరణకు కీలకమైన ఈ ప్రక్రియలో ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా నమోదు చేయాలని సూచించారు.భూ భారతి కార్యక్రమంలో భాగంగా ఎల్లారెడ్డిపేట మండలం సర్వాయిపల్లి గ్రామంలో రోవర్ యంత్రాల సహాయంతో చేపడుతున్న భూముల రీ సర్వే పనులను బుధవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వే పనుల పురోగతి, భూ సరిహద్దుల గుర్తింపు, రికార్డుల నమోదు తీరును పరిశీలిస్తూ అధికారులు, సర్వేయర్లకు పలు సూచనలు చేశారు.గ్రామంలోని రెవెన్యూ, అటవీ భూముల రీ సర్వే వివరాలను అడిగి తెలుసుకున్న అదనపు కలెక్టర్, సర్వే ప్రారంభానికి ముందు రైతులకు తగిన సమాచారం అందించాలన్నారు. రైతుల సమక్షంలో పారదర్శకంగా సర్వే నిర్వహించి, భవిష్యత్తులో వివాదాలకు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాస్, నాయబ్ తహసీల్దార్ వేణు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

# 420 అడుగుల ఫ్లెక్సీతో వేములవాడలో బీఆర్ఎస్ శంఖారావం

- "ప్రజా సమస్యలపై పోరాటం మరింత ఉధృతం చేస్తాం"చల్మెడ లక్ష్మీనరసింహారావు
- కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై వినూత్న నిరసన
- హామీల అమలులో ఘోర వైఫల్యం.. ప్రజలను మోసం చేసిన ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా భారీ ర్యాలీ, నినాదాలతో హోరెత్తిన పట్టణం



వేములవాడ / సెప్టెంబర్ 2 ప్రజాదివాస్

కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనపై తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ఆధ్వర్యంలో వేములవాడ పట్టణం బుధవారం రాజకీయ వేడెక్కింది. కోరుట్ల బస్టాండ్ చౌరస్తా నుంచి తెలంగాణ తల్లి విగ్రహం వరకు ఏకంగా 420 అడుగుల భారీ ఫ్లెక్సీతో నిర్వహించిన వినూత్న నిరసన ర్యాలీ ప్రజల దృష్టిని ఆకర్షించింది. వేలాది మంది బీఆర్ఎస్ శ్రేణులు, నాయకులు పాల్గొని ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ నినాదాలతో పట్టణాన్ని హోరెత్తించారు.బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చల్మెడ లక్ష్మీనరసింహారావు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. అధికారంలోకి రావడానికి వందలాది హామీలు ఇచ్చి, వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పిన పథకాలు వెయ్యి రోజులు గడిచినా ఆచరణలోకి రాలేదని విమర్శించారు.రైతులు, మహిళలు, నిరుద్యోగ యువత, బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు సహా అన్ని వర్గాల ప్రజలను ప్రభుత్వం మోసం చేసిందని పేర్కొన్నారు. ప్రజల ఆవేదనను ప్రతిబింబించేందుకే 420 అడుగుల ఫ్లెక్సీతో వినూత్న నిరసన చేపట్టామని తెలిపారు.ప్రభుత్వం వెంటనే ఆరు గ్యారెంటీలతో పాటు ఎన్నికల సమయంలో ఇచ్చిన అన్ని హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ప్రజా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, ఏనుగు మనోహర్‌రెడ్డితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

"420 హామీలు... 1000 రోజుల నిరీక్షణ"

# 420 అడుగుల ఫ్లెక్స్‌తో కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నిరసన

- 1000 రోజుల పాలన వైఫల్యాలపై సమరశంఖం ఊదిన గులాబీ శ్రేణులు
- ఆరు గ్యారంటీలు, 420 హామీలు420 హామీలు అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలం: తోట ఆగన్న



రాజన్న సిరిసిల్ల జిల్లా / సెప్టెంబర్ 02 ప్రజాదివాస్

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయిన నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన ఏడు రోజుల నిరసన కార్యక్రమాల్లో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు తోట ఆగన్న ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు.బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ నాయకులు తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రభుత్వ హామీల అమలు తీరుపై నిరసనగా బాకీ కార్డులను పంపిణీ చేయడంతో పాటు 420 అడుగుల భారీ ఫ్లెక్స్‌ను ప్రదర్శించి ప్రజల దృష్టిని ఆకర్షించారు.ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కాలయాపన చేస్తోందని, రైతులు, నిరుద్యోగులు, మహిళలు, పేదల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం ఆశించిన స్థాయిలో పనిచేయలేదని నాయకులు ఆరోపించారు. ఎన్నికల హామీల అమలుపై ప్రభుత్వం వెంటనే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాజీ జడ్పీ చైర్మన్ తులా ఉమ, రాష్ట్ర నాయకులు చీటీ నర్సింగారావు, మున్సిపల్ చైర్మన్ జిందం కళా చక్రపాణి, పట్టణ పార్టీ అధ్యక్షుడు చక్రపాణి, మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు, మాజీ జెడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు, సింగిల్ విండో చైర్మన్లు, సెస్ డైరెక్టర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.నిరసన కార్యక్రమం సందర్భంగా గులాబీ శ్రేణులు ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో హోరెత్తించగా, 420 అడుగుల ఫ్లెక్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ల పనితీరుపై డీఎంహెచ్ఓ సమీక్ష

- ప్రజలకు నాణ్యమైన ప్రాథమిక ఆరోగ్య సేవలే లక్ష్యం
- హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ల సేవలను మరింత సమర్థవంతంగా అందించాలి: డాక్టర్ ఏంజెలా ఆల్ఫ్రెడ్



రాజన్న సిరిసిల్ల జిల్లా సెప్టెంబర్ 2 ప్రజాదివాస్

రాజన్న సిరిసిల్ల జిల్లాలో హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ల ద్వారా ప్రజలకు అందుతున్న ఆరోగ్య సేవల పనితీరుపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఏంజెలా ఆల్ఫ్రెడ్ బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలోని మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ల (ఎంఎల్‌హెచ్‌పీలు) పనితీరును ఆమె సమగ్రంగా పరిశీలించారు.ఈ సందర్భంగా సాధారణ వ్యాధుల నిర్వహణ, తల్లి--శిశు ఆరోగ్య సేవలు, వ్యాధి నిరోధక కార్యక్రమాలు, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలపై సమీక్ష చేపట్టారు. గ్రామీణ ప్రజలకు నాణ్యమైన ప్రాథమిక ఆరోగ్య సేవలు అందించడంలో మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని డీఎంహెచ్ఓ పేర్కొన్నారు.ప్రతి హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌లో అందుబాటులో ఉన్న సేవలను ప్రజలకు సమర్థవంతంగా చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాల సాధనకు సమన్వయంతో పనిచేస్తూ సేవల నాణ్యతను మరింత మెరుగుపరచాలని ఆదేశించారు.ఈ సమావేశంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, డాక్టర్ సంపత్ కుమార్‌తో పాటు మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి: జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి. నీరజ

- సెప్టెంబర్ 12న నిర్వహించే లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవాలని పిలుపు
- పోలీసు అధికారులు, న్యాయమూర్తులతో సమన్వయ సమావేశం ఎక్కువ కేసుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచన




రాజన్న సిరిసిల్ల జిల్లా / సెప్టెంబర్ 2 ప్రజాదివాస్

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రజలు ఈ నెల 12న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకుని కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) అధ్యక్షురాలు శ్రీమతి పి. నీరజ పిలుపునిచ్చారు.బుధవారం జిల్లా కోర్టు సముదాయంలో జిల్లాకు చెందిన న్యాయమూర్తులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, పోలీసు అధికారులతో లోక్ అదాలత్ ఏర్పాట్లపై సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ, సాధ్యమైనంత ఎక్కువ సంఖ్యలో కేసులను పరిష్కరించేలా కృషి చేయాలని సూచించారు. ముఖ్యంగా రాజీకి అవకాశం ఉన్న కేసులను గుర్తించి లోక్ అదాలత్ ద్వారా త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.అలాగే పోలీసు అధికారులకు కేసుల సమన్వయం, రాజీ ప్రక్రియ వేగవంతం, ప్రజల్లో అవగాహన కల్పన తదితర అంశాలపై పలు సూచనలు చేశారు.ఈ సమావేశంలో పోక్సో కోర్టు న్యాయమూర్తి రాధిక జైస్వాల్, సీనియర్ సివిల్ జడ్జి మరియు డీఎల్ఎస్ఏ ఇన్‌చార్జి కార్యదర్శి పి. లక్ష్మణాచారి, వేములవాడ సీనియర్ సివిల్ జడ్జి అజయ్ కుమార్ జాదవ్, సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి, వేములవాడ డీఎస్పీ శ్రీనివాసులు, జూనియర్ సివిల్ జడ్జి కుమారి మేఘన, పోలీసు అధికారులు, కోర్టు మానిటరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా దివాస్ తెలుగు దినపత్రిక
03-09-2026

## బుగ్గారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో : 9 న మండల స్థాయి క్రీడలు



ప్రజాదివాస్

జగిత్యాల జిల్లా బుగ్గారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈనెల 9 నుండి మండల స్థాయి ఎస్ జి ఎఫ్ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి మోహన్ రెడ్డి తెలిపారు. బుధవారం మండల విద్యా వనరుల కేంద్రంలో పీఈటి, పిడి ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండలంలో పాఠశాలల క్రీడల సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు తీర్మానించారు. ఈనెల 9న అండర్ 14, అండర్ 17 బాయ్స్ కబడ్డీ, కోకో, వాలీబాల్, 10న అండర్ 14, అండర్ 17 బాలికల కబడ్డీ, కోకో, వాలీబాల్, 11న అండర్ 14 అండర్ 17 బాయ్స్ అండ్ గర్ల్స్ అథ్లెటిక్స్ ఈవెంట్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. అండర్ 14 లో పాల్గొన్న విద్యార్థినీ విద్యార్థులు 1-1-2013 నుండి 1-1-2010 మధ్య జన్మించిన వారు అర్హులు. అలాగే కబడ్డీ అండర్ 14 బాయ్స్ 51 కేజీలు అండర్ 17 బాయ్స్ అండ్ అండర్ 17 గర్ల్స్ 55 కేజీలు అండర్ 14 గర్ల్స్ 48 కేజీలు ఉండవలెను. ఈ సమావేశంలో మండల కన్వీనర్ జడ్పిహెచ్ఎస్ బుగ్గారం ఫిజికల్ డైరెక్టర్ అరుణ్ కుమార్, కేజీబీవీ మహేశ్వరి, సి ఆర్ పి పురుషోత్తం పాల్గొన్నారు.

# వైఎస్సార్ సేవలు చిరస్మరణీయం

**వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలు నేటికీ ప్రజల జీవితాల్లో స్థిర స్థాయిగా నిలిచాయి**

**: జిల్లా గ్రంథాలయ చైర్మన్ సంఘనభట్ల దినేష్ శర్మ**





ప్రజాదివాస్

దివంగత నేత మాజీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలు నేటికీ రెండు రాష్ట్రాలలోని ప్రజల గుండెల్లో స్థిరస్థాయిగా నిలిచాయని జగిత్యాల జిల్లా గ్రంథాలయ చైర్మన్ సంఘనభట్ల. దినేష్ శర్మ పేర్కొన్నారు బుధవారం దివంగత నేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలోని నంది చౌక్ వద్ద ధర్మపురి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వైయస్సార్ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంఘనబట్ల దినేష్ శర్మ , మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దివంగత నేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రవేశ ప్రతిమ అనేక సంక్షేమ పథకాలు నేటికీ కూడా రెండు రాష్ట్రాల ప్రజల మదిలో స్థిరస్థాయిగా నిలిచి ఉన్నాయని తెలిపారు 108 పథకం కానీ ఆరోగ్యశ్రీ పథకం విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ రైతులకు ఉచిత విద్యుత్ రుణమాఫీ గాని ఇలా ప్రతి రంగంలో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేసినారూ అని గుర్తు చేశారు అనంతరం ధర్మపురి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిలుముల లక్ష్మణ్, మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దివంగత నేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి తాను ప్రవేశపెట్టిన ప్రభుత్వ పథకాలతో ఉమ్మడి రాష్ట్ర ప్రజల గుండెల్లో నిలిచి ఉన్నారని రైతులకు రుణమాఫీ ఉచిత విద్యుత్తు జలయజ్ఞం పథకం ద్వారా ప్రాజెక్టులు నిర్మించడం ఇలా ఒకటొకటి గుర్తు చేశారు ఉపాధ్యక్షులు వేముల రాజేష్ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దివంగత నేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల మనసులో చిరస్మరణీయుడని ఆయన ప్రవేశపెట్టిన పథకాలు విద్య వైద్య రంగాలలో అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని గ్రామీణ ప్రాంత పేద ప్రజలకు పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందుబాటులోకి తీసుకురావడం ఫీజు రియంబర్స్మెంట్ పథకాలను అమలు చేశారని ఆరోగ్యశ్రీ ద్వారా నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందించారని కార్పొరేట్ వైద్యంతో అనేక కుటుంబాలకు భరోసా కల్పించారని ఇలా ఒకటొకటిగా రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలు ప్రజల గుండెల్లో స్థిరస్థాయిగా నిలిచాయని గుర్తు చేశారు . వైఎస్సార్ ప్రవేశపెట్టిన సంక్షేమ కార్యక్రమాలు నేటికీ ప్రజల జీవితాల్లో ఆయనను గుర్తుచేస్తున్నాయని అన్నరూ వైఎస్సార్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫోరం అధ్యక్షులు కాసరపు బాల గౌడ్ మరియు వివిధ గ్రామాల నుండి వచ్చిన సర్పంచులు, ధర్మపురి మండల కాంగ్రెస్ పార్టీ యువజన అధ్యక్షులు అప్పం తిరుపతి, మండల యువజన నాయకులు, జిల్లా యువజన నాయకులు, ఎన్ ఎస్ యు ఐ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అబద్దానికి అంగీ లాగు వేస్తే అది కాంగ్రెస్ రేవంత్ రెడ్డి

**- ఆందోల్ నియోజవర్గంలో బాకీ కార్డులతో భారీ ర్యాలీ తీసిన బిఆర్ఎస్ నాయకులు**

**- యూరియా యాప్ ద్వారా రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ**

**- రైతుల దగ్గర ఉండేవి చిన్న ఫోన్లు మాత్రమే వాటితో యూరియా మందులు ఎలా బుక్ చేసుకుంటారు**

**- ఇచ్చిన హామీలను మర్చిపోయారు అంటూ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ ద్వాజమెత్తారు**

ప్రజాదివాస్



ఆందోల్ నియోజకవర్గం జోగిపేట మున్సిపాలిటీలోని జోగిపేట పట్టణంలో బిఆర్ఎస్ నాయకులు ఆందోల్ నియోజకవర్గం కార్యకర్తలు పాల్గొని భారీ ర్యాలీ తీశారు 100 రోజులు అని చెప్పి అధికారంలోకి వచ్చి 1000 రోజులు..1000 అబద్దాలు..1000 మోసాలతో తెలంగాణ సమాజాన్ని విజయవంతంగా నిండా ముంచిన గుంపుమేస్త్రీకి వ్యతిరేకంగా అందోల్ నియోజకవర్గం కేంద్రం లో గౌ, శ్రీ మాజీ ఎంఎల్ఏ చంటి క్రాంతి కిరణ్ అన్న ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించడం జరిగింది ఇందులోపార్టీ నాయకులు మాజీ జెడ్పిటిసి చైర్మన్ పట్లోళ్ల మంజుశ్రీ జయపాల్ రెడ్డి జోగిపేట మున్సిపల్ కౌన్సిలర్ పట్లూరి శివశేఖర్ రామా గౌడ్ బీర్ల శంకర్ ఎర్రగుల మహేష్ యాదవ్ శంకర్ పంతులు జిన్నా విజయ్ కుమార్ సాయికుమార్ (పింటూ ) అలాగే పట్టణ అధ్యక్షులు ఉపాధ్యక్షులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## ఉద్యోగ బాధ్యతల పట్ల క్రమశిక్షణతో పనిచేసిన వ్యక్తి చిలక శ్రీనివాస్ రిటైర్మెంట్ కార్యక్రమంలో : రాష్ట్ర ఎస్సీ ఎస్టీ మైనార్టీ ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షులు బొల్లి స్వామి

ప్రజాదివాస్

తమ ఉద్యోగ బాధ్యతల పట్ల క్రమశిక్షణతో విధుల నిర్వహించి తన పని చేసిన చోట మంచి పేరు సంపాదించుకుని నేడు ఏ ఎస్ ఐ రిటైర్మెంట్ అవుతున్న చిలుక శ్రీనివాస్ కు పదవి విరమణ శుభాకాంక్షలు అని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ మైనార్టీ మాజీ ఎంపిటిసిల ఫోరం అధ్యక్షులు బొల్లి స్వామి తెలిపారు జగిత్యాల జిల్లా మల్యాల లో ఏ ఎస్ గా పనిచేసే తేదీ 31 ఎనిమిది 2026న ఉద్యోగ విరమణ పొందుతున్న ఏఎస్ఐ చిలుక శ్రీనివాస్ రిటైర్మెంట్ కార్యక్రమాన్ని కరీంనగర్ జిల్లా భూపాలపట్నం ఫంక్షన్ హాల్ లో నిర్వహించగా ఈ కార్యక్రమానికి వివిధ పార్టీలకు చెందిన నాయకులు అధికారులు బంధువులు మిత్రులు భారీగా హాజరైనారు ఈ కార్యక్రమానికి హాజరైన నాయకులు మరియు రాష్ట్ర ఎస్సీ ఎస్టీ మైనార్టీ ఎంపిటిసిల ఫోరం మాజీ అధ్యక్షులు బొల్లి.స్వామి మాట్లాడుతూ గత 38 సంవత్సరాలుగా పోలీస్ డిపార్ట్మెంట్లో కానిస్టేబుల్ నుండి ఏ ఎస్ ఐ గా చిలక శ్రీనివాస్ తన ఉద్యోగం పట్ల అంకితభావంతో క్రమశిక్షణగా ప్రజలకు సేవలు అందించారని అటు ఉన్నత అధికారులు ఇచ్చిన ఆదేశాలు పాటించి మరి మన్ననలు పొందాలని ఆయన పని చేసిన చోట మంచి పేరు సంపాదించుకున్నారని గుర్తు చేశారు ఇదేవిధంగా పేద విద్యార్థులు చదువు మానేసిన వారిని తిరిగి పాఠశాలలో చేర్పించారని తనకున్నంతలో సహాయం అందించారని వారి సేవా భావం చాలా గొప్పదని ఉద్యోగ విరమణ చేసినప్పటికీ ఇలాంటి సేవలు వారు అందిస్తారని ఆశిస్తూన్నని తెలుపుతూ వారి శేష జీవితం ఆయురారోగ్యాలతో ఉండాలని



భగవంతుని కోరుకుంటున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో తొగర్రాయి ఫ్యాక్స్ చైర్మన్ చిలుక సతీష్ ఆర్ అండ్ బి రిటైర్డ్ ఈ ఈ తాంద్ర అంజయ్య పాస్టర్ కదారి రవి కదారి వెంకటేష్ డేవిడ్ బంధుమిత్రులు అధికారులు వివిధ పార్టీల నాయకులు ఎదురుగట్ట గ్రామ ప్రజలు తదితరులు భారీగా పాల్గొన్నారు

## మోడల్ స్కూల్ లో ఘనంగా వృక్షా బంధన్ కార్యక్రమం

ప్రజాదివాస్



పెనుబల్లి /టేకులపల్లి : మండల పరిధిలోని టేకులపల్లి మోడల్ స్కూల్లో ఘనంగా వృక్షాబంధన్ కార్యక్రమం నిర్వహించారు పాఠశాలలోని ఎకోక్లబ్ ఆధ్వర్యంలో చెట్టుతో సహచర్యం మొక్కతో రక్షాబంధనం అనే దీమ్ తో కొత్తగా మొక్కలు నాటారు అలాగే ఆల్రెడీ ఉన్న మొక్కలతో రక్షాబంధనం లాగా దారాలతో వాటితో మమేకమై వృక్ష వందనం కార్యక్రమం నిర్వహించుకున్నారు ఈ కార్యక్రమంలో పాఠశాల సైన్సు ఉపాధ్యాయులు కందుల రవి నాగేంద్ర తోరణి వినోద పాల్గొన్నారు పాఠశాల ఇన్చార్జి ప్రిన్సిప ల్ విమలా గ్లోరీ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు

# పేదల పక్షపాతి రైతు బాంధవుడు వైస్ఆర్

**- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మొట్టమొదటిగా రుణమాఫీ చేసిన ఘనత వైఎస్ రాజశేఖర్ రెడ్డి కి దక్కుతుంది**

**- మొట్టమొదట 108 తీసుకొచ్చింది వైయస్ ఆర్**

**- ఆయన వర్ధంతి సందర్భంగా నివాళు లర్పించిన జోగిపేట కాంగ్రెస్ పార్టీ నాయకులు**



ప్రజాదివాస్

ఆందోల్ నియోజకవర్గం జోగిపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యములో బుధవారం వైస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భముగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు .ఈ సందర్భంగా మార్క్ పెడ్ డైరెక్టర్ జగన్మోహన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు డాకూరి వెంకటేశం మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైస్ రాజశేఖర్ రెడ్డి రాష్ట్రములో పాదయాత్ర చేసి నిరుపేదల,విద్యార్థుల కష్టాలను చూసి చలించి పోయి రాష్ట్రములో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి ఉచిత విద్యుత్ పైన సంతకము చేసి రైతులకు ఉచిత విద్యుత్ ఇచ్చి వారి కష్టాల్లో ఆదుకున్న రైతు భాండవుడు అయ్యాడు.అలాగే పేదలకు ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం అందచేసి ఆరోగ్య ప్రదాత అయ్యాడు. విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ ఇచ్చి విద్యా ప్రదాత అయ్యాడు రాష్ట్రములో ఎన్నొ సంక్షేమ పథకాలు అందించి పేదల పక్షపాతిగా నిలిచాడు అన్నారు.అలాగే రాష్ట్రములో తన పాదయాత్రతో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చి ఘనత ఆయనదే అన్నారు ఆందోల్ నియోజకవర్గానికి సింగూర్ జలాలు ఇచ్చి 40000 వేల ఎకరాలు సస్యశ్యామలం చేశారు అని కొనియాడారు.ఈ కార్యక్రమములో సీనియర్ నాయకులు మాజీ కౌన్సిలర్ సురేందర్ గౌడ్,కౌన్సిలర్స్ కోశికే రాజశేఖర్,హరికృష్ణ,రామకృష్ణ,పట్లోల్ల శ్రీనివాస్,మాజీ కౌన్సిలర్స్ కోరబోయిన నాగరాజు నాని,తుపాకుల సునిల్,శరత్ బాబు, పిట్ల లక్ష్మణ్,కో ఆప్షన్ మెంబెర్ ప్రవీణ్,ఆత్మ కమిటీ సభ్యులు చిట్యాల మధు, ఖలేద్,నాయకులు దాకూరి శ్రీనివాస్,బేగారి అనిల్,ఆకుల నందు,కొత్త శ్రీశైలం,గౌహేర్ అలీ,అబ్బాస్ అలీ,మురళి బండల సంతోష్,తదితరులు పాల్గొన్నారు

# వెల్గటూర్ మండల కేంద్రంలో ఘనంగా వైయస్సార్ వర్ధంతి వేడుకలు

**వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలు నేటికీ ప్రజల గుండెల్లో స్థిర స్థాయిగా నిలిచాయి : మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తాటిపర్తి శైలేందర్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ గొల్ల తిరుపతి**

ప్రజాదివాస్

దివంగత నేత మాజీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలు నేటికీ రెండు రాష్ట్రాల ప్రజల గుండెల్లో నిలిచాయని పేర్కొన్నారు బుధవారం దివంగత నేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తాటిపర్తి శైలేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ని కాంగ్రెస్ పార్టీ నాయకులు వైయస్సార్ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం మండల కాంగ్రెస్ పార్టీ నాయకుడు తాటిపర్తి శైలేందర్ రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దివంగత నేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రవేశ పెట్టిన అనేక సంక్షేమ పథకాలు నేటికీ కూడా రెండు రాష్ట్రాల ప్రజల మదిలో స్థిరస్థాయిగా నిలిచి ఉన్నాయని తెలిపారు 108 పథకం కానీ ఆరోగ్యశ్రీ పథకం విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ రైతులకు ఉచిత విద్యుత్ రుణమాఫీ ప్రాజెక్టులు నిర్మించడం (ఎల్లంపల్లి ప్రాజెక్టు ) గాని ఇలా ప్రతి రంగంలో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేసినారూ అని గుర్తు చేశారు అనంతరం ఏఎంసీ చైర్మన్ గొల్ల తిరుపతి మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దివంగత నేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి తాను ప్రవేశపెట్టిన ప్రభుత్వ పథకాలతో ఉమ్మడి రాష్ట్ర ప్రజల గుండెల్లో నిలిచి ఉన్నారని రైతులకు రుణమాఫీ ఉచిత విద్యుత్తు జలయజ్ఞం పథకం ద్వారా ప్రాజెక్టులు నిర్మించడం 108 పథకం గాని ఆరోగ్యశ్రీ పథకం పేద ప్రజలకు విద్య వైద్యం లాంటివి ఇలా ఎన్నో అని ఇలా ఒకటొకటి గుర్తు చేశారు ఇలాంటి పథకాలతో రాజశేఖర్ రెడ్డి ప్రజల గుండెల్లో స్థిరస్థాయిగా నిలిచాయని గుర్తు చేశారు . వైఎస్సార్ ప్రవేశపెట్టిన సంక్షేమ కార్యక్రమాలు నేటికీ ప్రజల జీవితాల్లో ఆయనను గుర్తుచేస్తున్నాయని



అన్నరూ వైఎస్సార్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కోటిలింగాల ఆలయ చైర్మన్ పూదరి రమేష్ మాజీ సర్పంచ్ మెరుగు మురళి గౌడ్ గుండాటి సందీప్ రెడ్డి రంగు తిరుపతి గౌడ్ గుమ్ముల వెంకటేష్ బందెల ఉదయ్ మెరుగు నరేష్ దావుల శశి వెంకటాపూర్ సర్పంచ్ బిల్లకూరు తిరుపతి గడ్డం నరస య్య సప్ప లింగయ్య రాయకోటి గుమ్మల అజయ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు

# వీ ఓ ఏ గా తిరిగి అవకాశం కల్పించాలని మంత్రి లక్ష్మణ్ కుమార్ కు ఎంపీ గడ్డం వంశీకృష్ణకు వినతి

ప్రజాదివాస్



జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం చర్లపల్లి గ్రామంలో వివో ఏ గా విధులు నిర్వహించిన సిగిరి సునీత ఇటీవల జరిగినటువంటి సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసినా సందర్భంగా తన వీ ఓ ఏ కు రాజీనామా సమర్పించి సర్పంచ్ గా పోటీ చేసి 36 ఓట్ల తేడాతో ఓడి పోయారు ఇప్పుడు తిరిగి వీ ఓ ఏ గా తిరిగి విధులోకి తీసుకోవాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కు , పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణకు వినతి పత్రం సమర్పించారు ఈ సందర్భంగా సిగిరి సునీత మాట్లాడుతూ 2009 నుండి2025 వరకు వీ ఓ ఏ గా పనిచేశానని గ్రామంలో వీ ఓ ఏ భవన నిర్మాణం కొరకు అందరి సహాయంతో 10 గుంటల భూమి సాధించి భవన నిర్మాణం చేపట్టడం జరిగింది అని అదేవిధంగా , ఐకెపి కేంద్రం ద్వారా ధాన్యం కొనుగోలులో కీలకంగా పనిచేసేనని తెలిపారు కరోనా సమయంలో ఎన్నో సేవలు అందించామని తెలిపారు తాను వివోఏ గా అంకిత భావంతో సేవలందించినందుకు గాను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని వేడుకుంటున్నారు

# ఇటీవల హత్యకు గురైన శిరీషా కుటుంబాన్ని పరామర్శించిన ఎంపీ రవిచంద్ర

**- బాధితులతో ఫోన్లో మాట్లాడి ఓదార్చిన కేటీఆర్ పార్టీ అండగా ఉంటుంది, న్యాయం జరిగే వరకూ పోరాడుతాం అని హామీ**

ప్రజాదివాస్

అత్యాచారానికి గురై చంపబడిన శిరీషా కుటుంబాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ.రామారావు ఓదార్చారు,పార్టీ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ముల్కలపల్లి మండలం చౌటిగూడెంకు చెందిన ఊకే శిరీషా హైదరాబాద్ లోని ఒక ఆస్పత్రిలో నర్స్ గా పని చేస్తూ అత్యాచారానికి గురై చంపబడిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా కేటీఆర్ సూచనల మేరకు బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర, అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావులు బుధవారం



చౌటిగూడెంలోని శిరీషా నివాసానికి వెళ్లి ఆమె చిత్రపటానికి పూలుజల్లి శ్రద్ధాంజలి ఘటించి మౌనం పాటించారు. ఆ తర్వాత ఎంపీ రవిచంద్ర బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కేటీఆర్ కు ఫోన్ చేసి శిరీషా తల్లి రామలక్ష్మీ,సోదరుడు శివరాంలతో మాట్లాడించారు. పుట్టెడు దుఃఖంతో ఉన్న వారిని కేటీఆర్ ఓదార్చి పార్టీ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. ఈ దారుణానికి ఒడిగట్టిన రాక్షసుడిని కఠినంగా శిక్షించడం ద్వారా తమకు న్యాయం చేయాల్సిందిగా శిరీషా వారు కోరగా కేటీఆర్ స్పందించి ఈ దారుణ ఘటన గురించి అసెంబ్లీలో లేవనెత్తి తప్పకుండా న్యాయం జరిగేలా చూస్తానని అభయమిచ్చారు. ఆపదలో ఉన్న మిమ్మల్ని ఓదార్చి మనోధైర్యాన్ని ఇవ్వడానికే రవిచంద్ర, నాగేశ్వరరావులు వచ్చారని,న్యాయం జరిగే వరకు మీ కుటుంబానికి బీఆర్ఎస్ అండగా ఉంటుందని కేటీఆర్ వారికి చెప్పారు. శిరీషా తల్లి రామలక్ష్మికి ఎంపీ రవిచంద్ర 50వేల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ వద్దిరాజు వెంట బీఆర్ఎస్ నాయకులు ఉప్పల వెంకటరమణ,కాపు సీతామహాలక్ష్మీ,సింధూ తపస్వి,ఉపాధ్యాయుల సూర్యప్రకాశరావు,మోరంపూడి అప్పారావు,పుష్పాల చందర్ రావు,మేకల వెంకటేశ్వర రావు, కొండవీటి రాజారావు,మేకల రాజేష్, గ్రామ సర్పంచ్ పద్మ తదితరులు ఉన్నారు.

# తారాలపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్, ల్యాప్‌టాప్‌ల పంపిణీ

**- ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు,**
**- డిసిసి అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి**

ప్రజాదివాస్




మడికొండ బాలవికాస స్వచ్ఛంద సంస్థ సౌజన్యంతో వరంగల్ జిల్లా పరిధిలోని తారాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కంప్యూటర్ ల్యాబ్‌కు ల్యాప్‌టాప్‌లను మంజూరు చేశారు. 45వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కర్ర హరీష్ రెడ్డి ప్రత్యేక చొరవతో ల్యాప్‌టాప్‌లను ఇప్పించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి వర్ధన్నపేట నియోజకవర్గ శాసనసభ్యులు (ఎమ్మెల్యే) కే.ఆర్. నాగరాజు, హనుమకొండ డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు రిబ్బన్ కట్ చేసి కంప్యూటర్ ల్యాబ్‌ను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి డిజిటల్ విద్యను అందించేందుకు బాలవికాస సంస్థ మరియు స్థానిక నాయకులు చేసిన కృషి అభినందనీయమన్నారు. విద్యార్థులు ఈ ఆధునిక సాంకేతికతను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బాలవికాస ఎక్సిక్యూటివ్ డైరెక్టర్ సింగారెడ్డి శౌరి రెడ్డి, 45వ డివిజన్ అధ్యక్షులు కర్ర హరీష్ రెడ్డి,పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, బాలవికాస ప్రతినిధులు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# 1000 రోజుల పాలన.. హామీల అమలు ఏదీ?

**-చల్లా ధర్మారెడ్డి,మాజీ ఎమ్మెల్యే.**
**- కాంగ్రెస్ వైఫల్యాలపై పరకాలలో బీఆర్ఎస్ నిరసన**
**- చల్లా ధర్మారెడ్డి ఆధ్వర్యంలో 420 అడుగుల ఫ్లెక్సీతో భారీ ర్యాలీ.. బస్టాండ్ వద్ద ధర్నా..**

ప్రజాదివాస్

కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పరకాలలో బుధవారం భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆధ్వర్యంలో అంబేద్కర్ సెంటర్ నుంచి బస్టాండ్ వరకు 420 అడుగుల ఫ్లెక్సీ తో బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. మొదటగా అంబేద్కర్ సెంటర్ లోని వారి విగ్రహానికి పూలమాల వేసి ర్యాలీ ప్రారంభించి బస్టాండ్ కూడలి వద్ద ధర్నా చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలు, రైతు రుణమాఫీ, రైతు భరోసా, రెండు లక్షల ఉద్యోగాల హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో హామీలను అమలు



చేస్తామని దేవుళ్లపైనా ఓట్లువేసి,బాండ్ పేపర్లపై సంతకాలు చేసి హామీ ఇచ్చినప్పటికీ 1000 రోజులు గడిచినా ఏ ఒక్క హామీ అమలు కాలేదని ఆరోపించారు. రైతులు,మహిళలు,యువత,నిరుద్యోగులు,పేదలకు ఇచ్చిన హామీల విషయంలో ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణతో ముందుకు రావాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ప్రజలకు గుర్తు చేస్తూ బీఆర్ఎస్ ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇకనైనా ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి ప్రజలకు న్యాయం చేయాలని చల్లా ధర్మారెడ్డి డిమాండ్ చేశారు. హామీల అమలుపై ప్రభుత్వం స్పందించకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నియోజకవర్గవ్యాప్తంగా మరింత పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రజలు మోసపోవడం ఖాయమని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ముందుగానే హెచ్చరించారని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి గుర్తుచేశారు. ఇక కాంగ్రెస్ ను నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరని,కర్రుకాల్చి వాతలు పెట్టడానికి ప్రజలున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా వైఎస్సార్ వర్ధంతి నివాళులర్పించిన డీసీసీ అధ్యక్షుడు వెంకట్రామ్ రెడ్డి, ఎమ్మెల్యే నాగరాజు

ప్రజాదివాస్




ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి 17వ వర్ధంతిని పురస్కరించుకుని హన్మకొండలోని డీసీసీ కార్యాలయంలో ఘనంగా నివాళు లర్పించారు. హన్మకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ నివాళి కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పల్లె శ్రీనివాస్ గౌడ్, భత్తిని శ్రీనివాస్ రావు, వరంగల్ మార్కెట్ కమిటీ చైర్మన్ పులి ప్రియాంక, ఐవైసీ జాతీయ కార్యదర్శి గొట్టిముక్కుల సాగరిక, డీసీసీ మీడియా కమిటీ చైర్మన్ మార్క విజయ్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు. వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఆయన చేసిన ప్రజాసేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్పొరేషన్ల చైర్మన్లు, పీసీసీ, డీసీసీ కమిటీ సభ్యులు, మండల, పట్టణ, డివిజన్ కాంగ్రెస్ కమిటీల ప్రస్తుత, మాజీ అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు.